
వైసీపీ రోజూ తప్పుడు ప్రచారాలతోనే ప్రజలను
తప్పుదారి పట్టిస్తోంది. రాజధాని
మునిగిపోయిందని, ప్రాజెక్టులు
కొట్టుకుపోతున్నాయని, ఊళ్లు
మునుగుతున్నాయని అబద్ధాలు చెప్పి
భయభ్రాంతులు కలిగిస్తోంది. అసత్యాలతో
గందరగోళం సృష్టించడం తప్ప మరేమీ చేయని
వైసీపీ పార్టీపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.
ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

మంగళవారం 19.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 127 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# కృష్ణా నదిపై .. ఐకానిక్ వంతెన



## రూ.904 కోట్లతో రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల పనులు

## అమరావతిలోని కీలక ప్రాజెక్టులకు ఎస్పీవీ

## మంగళగిరిలో 'గోల్డ్ క్లస్టర్' కోసం భూ సమీకరణ

## సీఆర్డీఏ అథారిటీలో 9 ప్రతిపాదనలకు ఆమోదం

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 51వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై నిర్మించే ఐకానిక్ వంతెనకు అద్భుతమైన డిజైన్ ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంప్రదాయ కూచిపూడి నృత్య భంగిమ సహా వేర్వేరు నూతన డిజైన్లను పరిశీలించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 51వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం 9 ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేసింది. రాజధాని అమరావతిలో చేపట్టే వివిధ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు ప్రత్యేక వాహక సంస్థ ఏర్పాటుకు సీఆర్డీఏ అథారిటీ తన ఆమోదాన్ని తెలియచేసింది. రాజధానిలో చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్, రివర్ ఫ్రంట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, రోప్ వే లాంటి ప్రాజెక్టులకు ఎస్పీవీ ఏర్పాటు చేసేందుకు అంగీకారాన్ని తెలిపింది. మిగతా 2లో...

## 'స్త్రీశక్తి'కి అద్భుత రెస్పాన్స్

### సోమవారం ఒక్కరోజే 18 లక్షల మంది ఉచిత ప్రయాణాలు

### జీరో ఫేర్ టికెట్ ద్వారా మహిళలకు రూ.7 కోట్లకు పైగా ఆదా

### 4 రోజుల్లో 47 లక్షల మంది ప్రయాణం..రూ.19 కోట్ల లబ్ది

### గుర్తింపు కార్డు సాఫ్ట్ కాపీ చూపినా ఉచిత ప్రయాణానికి ఓకే

### ఘాట్ రూట్లలో కూడా పథకం వర్తింపు

### స్త్రీశక్తి -ఉచిత బస్సు ప్రయాణం పథకంపై సీఎం సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం స్త్రీశక్తికి అద్భుతమైన స్పందన కనిపిస్తోంది. రోజు రోజుకీ మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. సోమవారం ఒక్క రోజులోనే 18 లక్షల మందికి పైగా మహిళలు జీరో ఫేర్ టికెట్ తో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. దీంతో వారికి రూ. 7 కోట్లకు పైగా ఆదా అయ్యింది. పథకం ప్రవేశపెట్టిన నాలుగు రోజుల్లో 47 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోగా.. దాదాపు రూ. 19 కోట్ల మేర వారికి ఆదా అయ్యింది. మిగతా 2లో...

## అంటువ్యాధులపై అప్రమత్తం



### అంటు వ్యాధుల నియంత్రణ చర్యల్లో వేగాన్ని పెంచాలి

### సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### మంత్రి సత్యకుమార్ అదేశాలు

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** భారీ వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలను త్వరితగతిన తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. గతంలో నమోదైన కేసుల ఆధారంగా గుర్తించిన ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాల్లోని తాజా పరిస్థితులపై అధికారులు మంత్రికి సోమవారం వివరించారు. వెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రజలకుండా ఉండేందుకు ఇతర శాఖలతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ వచ్చేనెల వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున అంటు రోగాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో మిగతా 2లో...

## క్వాంటమ్ వ్యాలీకి

### కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో లోకేష్ భేటీ

# సాయం అందించండి



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** అడ్వాన్స్ డ్ టెక్నాలజీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, క్వాంటమ్ ఆవిష్కరణలు, విధానపరమైన సంస్కరణల్లో ముందున్న ఆంధ్రప్రదేశ్ కు సహకారం అందించాలని మంత్రి నారా లోకేష్ కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరు చేయడంపై కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్ కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు ద్వారా ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ హబ్ గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఐటి పెట్టుబడులను ప్రోత్సహించడం వల్ల వలసలను తగ్గించి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి అవకాశం ఏర్పడుతుంది. టైర్ -3 నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఐటి పరిశ్రమ విస్తరించేలా ఆదాయపన్ను మినహాయింపులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం అత్యవసరంగా పర్మినెంట్ ఎస్టాబ్లిష్ మెంట్ రూల్స్ లో సవరణలు చేపట్టండి. విదేశీ క్లౌడ్ సర్వీసు ప్రొవైడర్లు భారత్ లో పెట్టుబడి పెట్టడానికి, ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగుపర్చడానికి ఇది అనివార్యం. మిగతా 2లో...

## మహిళల్లో నూతనోత్సాహం



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం "సూపర్ సిక్స్" హామీల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీ అయిన "స్త్రీ శక్తి" పథకం మహిళల్లో నూతనోత్సాహాన్ని, ఆహ్లాదాన్ని తీసుకు వచ్చిందని రాష్ట్ర మహిళా అభివృద్ధి & శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని 2.62 కోట్ల మహిళల గౌరవార్థం 79 వ స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఇచ్చిన కానుక అన్నారు. ఈ పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలు అవుతున్నదని, రోజుకి దాదాపు 25 లక్షల మంది మహిళలు ఐదు రకాల ఆర్.టి.సి. బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని ఆమె తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో దాదాపు 50 శాతం మంది మహిళలే ఉన్నారని, వారి అభ్యున్నతిని, సంక్షేమాన్ని కాంక్షిస్తూ మిగతా 2లో...

## రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ



- 1 సెప్టెంబర్, 2025 నుంచి 31 ఆగస్టు, 2028 వరకు అమలు
- కొత్త వారిని ప్రోత్సహించేలా పాదర్శకంగా కొత్త బార్ పాలసీ
- నిషాంత్ కుమార్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** మూడేళ్ల కాలపరిమితో రాష్ట్రంలో నూతన బార్ పాలసీని అమలు చేయనున్నట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు.. సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి ఐహెచ్ సీ భవన్ లో గల ఎక్సైజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో మిగతా 2లో...

## పారదర్శకంగా ఎరువుల పంపిణీ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎరువుల సరఫరాలో ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా, ప్రణాళిక బద్ధంగా జరిగేటట్లుగా సరైన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వ్యవసాయ అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అదేశించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎరువుల పంపిణీ సజావుగా సాగుతున్నా కూడా కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలుసుకున్న మంత్రి విజయవాడ లోని క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, మార్క్ ఫెడ్ ఎండీ మనజీర్ జిలాని సామున్, సంబంధిత అధికారులతో మిగతా 2లో...

## వాయుగుండం.. అప్రమత్తం



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడిన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. ఈ ఐదురోజులపాటు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని మంత్రి అన్నారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని మిగతా 2లో...

## పర్యాటకానికి నిధులు!

### ఏపీ పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధికి కేంద్రం హామీ

### న్యూఢిల్లీ పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి



**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చెప్పినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడ నుండి న్యూఢిల్లీ బయలుదేరిన మంత్రి కందుల దుర్గేష్ సోమవారం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర పర్యాటక అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లా లతో భేటీ అయ్యారు.. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ అభివృద్ధికి సంబంధించి దాదాపు రూ. 270 కోట్ల విలువైన మూడు పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్ లు సమర్పించారు. ప్రధానంగా లేపాక్షిలో కల్చరల్ సెంటర్, పర్యాటకుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 103 కోట్లు, లంబసింగిలో పర్యాటకులకు ఆహ్లాదకరమైన, అద్భుతమైన అనుభవాల కల్పనకు రూ. 99.87 కోట్లు, బుద్ధిస్ట్ సర్క్యూట్ సమీపంలో టెంట్ సిటీల ఏర్పాటుకు రూ. 77.32 కోట్లు అవసరమవుతాయని సంబంధిత డీపీఆర్ లను కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కు మంత్రి కందుల దుర్గేష్ సమర్పించారు. మిగతా 3లో...

# కృష్ణానదిపై ఐకానిక్ వంతెన

(మొదటి పేజీ తరువాయి)

మంగళగిరి లో గోల్డ్ క్లస్టర్ లో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు ఏర్పాటుకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూ సమీకరణ చేసేందుకు కూడా అథారిటీ అమోదించింది. మంగళగిరిలోని ఆత్మకూరు వద్ద 78 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్ ను ఏర్పాటు చేసేందుకు భూ సమీకరణ చేయాలన్న సీఆర్డీఏ ప్రతిపాదనకు అథారిటీ అమోదాన్ని తెలియచేసింది. దీని కోసం ప్రత్యేకంగా ఎల్పీఎస్ నిబంధనలకు కూడా అథారిటి ఆమోదించింది. మరోవైపు గోల్డ్ క్లస్టర్ వద్ద ప్రత్యేక ఎకో సిస్టం వచ్చేలా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రూ. 5 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని.. 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని సీఆర్డీఏ అథారిటి అభిప్రాయం వ్యక్తం చేసింది. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామ పంచాయితీల్లో డ్రెయిన్లు, నీటి సరఫరా ఇతర మౌలిక సదుపాయాల కోసం ఎల్పీఎస్ జోన్స్ క్రిటికల్ ఇన్ ఫ్రా అండ్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్ కింద రూ. 904 కోట్లతో పనులు చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. భూసమీకరణ పథకం కింద ఇచ్చే యాజమాన్య



ధృవీకరణ సర్టిఫికెట్‌లో అసైన్డ్ అనే పదాన్ని తొలగిచేందుకు కూడా సీఆర్డీఏ అథారిటి ఆమోదాన్ని తెలిపింది. అమరావతి రాజధాని నగరంలో సివరేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ. 411 కోట్లు, అలాగే వాటర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను రూ. 376.60 కోట్లతో ఏర్పాటు చేసేందుకు అథారిటీ అంగీకరించింది. విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు కూడా అదనపు భూ కేటాయింపులు చేసేందుకు సీఎం అధ్యక్షతన అథారిటీ ఆమోదం తెలిపింది. విట్‌కు 100 ఎకరాలు, ఎస్ఆర్ఎంకు 100 ఎకరాల చొప్పున అదనపు భూ కేటాయింపులకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది.

**ఈ సీజన్‌లోనే రాజధానికి ఒక రూపం**

రాజధానిలో చేపట్టే నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియచేసేలా ఆన్ లైన్ లో ఉంచాలని అన్నారు. ఈ సీజన్‌లోనే నిర్మాణాలు పూర్తి చేసి రాజధానికి ఒక రూపం తీసుకురావాలన్నారు. ప్రత్యేక వాహక సంస్థ ద్వారా చేపట్టే స్పోర్ట్ సిటీ లాంటి ప్రాజెక్టులను అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. రివర్ ఫ్రంట్ , రోప్ వే, ఇన్నర్ రింగ్ రోడ్డులను అనుసంధానించాలని సీఎం సూచించారు. రాజధాని ప్రాంతంలో కాలుష్య రహిత పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రతిష్టాత్మక బయో ఇంజినీరింగ్ యూనివర్సిటీ కూడా అమరావతికి రానుందని సీఎం పేర్కొన్నారు. దేశంలో మరే ప్రాంతానికీ లేని భౌగోళికపరమైన సానుకూలతలు అమరావతికి ఉన్నాయని... అందుకే ఇక్కడ చేపట్టే నిర్మాణాలన్నీ ఐకానిక్ గా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతీ ప్రాజెక్టు పరిధిలోనూ ఆర్థిక కార్యాకలాపాలు జరిగేలా ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సీఆర్డీఏ అథారిటీ సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సీఎస్ కె.విజయానంద్, పురపాలక, సీఆర్డీఏ, ఏడీసీకి చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 'స్త్రీశక్తి'కి అద్భుత రెస్పాన్స్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం అమలు తీరుపై ఆర్టీసీ ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం సమీక్షించారు. ఘాట్ రూట్‌లలోని ఆర్టీసీ సర్వీసుల్లో స్త్రీ శక్తి పథకం అమలుకు ముఖ్యమంత్రి అంగీకారాన్ని తెలిపారు. ఈమేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ప్రయాణించే మహిళల గుర్తింపు ధృవీకరణ కోసం ఆధార్ జిరాక్సుతో పాటు మొబైల్ డిజిటల్ లాకర్లోని సాఫ్ట్ కాపీని కూడా అనుమతించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మరోవైపు రోజువారీ ప్రయాణంలో తమకు ఎంత మేర ఆదా అవుతుందన్న అంశాలను మహిళలు తమతో సంతోషంగా పంచుకుంటున్నట్టు అధికారులు సీఎంకు తెలిపారు. స్త్రీశక్తి పథకం వర్తించే సర్వీసులను మహిళలు సులభంగా గుర్తించేలా బస్సు లోపలా బయటా బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

## మహిళల్లో నూతనోత్సాహం



(మొదటి పేజీ తరువాయి)

మరియు వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 'స్త్రీ శక్తి' పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం జరుగుచున్నదన్నారు. APSRTC కి ఉన్న మొత్తం బస్సుల్లో దాదాపు 74 శాతం అంటే 8,458 బస్సుల్లో రాష్ట్రంలోని మహిళలు, ట్రాన్స్జండర్లు, బాలికలు రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని చంద్రన్న ప్రభుత్వం కల్పించిందన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ మరియు మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు.

ఈ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకునే వెసులుబాటు మహిళలకు కలుగుతుందని, గ్రామీణ ప్రాంత మహిళలు, బాలికలు పట్టణాల్లో ఉన్నత చదువులు, ఇతర ఉద్యోగాలు చేసుకునే అవకాశం లభించిందన్నారు. రోజు వారీగా పనిచేసుకునే మహిళలకు, చిన్నపాటి మహిళా ఉద్యోగస్థులకు, విద్యార్థినులకు, చిరువ్యాపారులకు ఈ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రయాణ ఖర్చుల భారం తగ్గిపోయిందన్నారు. ఈ స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయడం వల్ల ప్రతి కుటుంబానికి ప్రయాణ ఛార్జీల రూపంలో నెలకు రూ. 2000 నుంచి రూ. 3000 వరకు ఆదా అవుతుందన్నారు. ఈ పథకం పేద కుటుంబాల్లో ఆర్థిక పొదుపును తీసుకురావడమే కాకుండా, శుభకార్యాలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు వెళ్లే, తీర్థయాత్రలు చేసే మహిళలు, వృద్ధులకు ఎంతో గానో ప్రయోజనకరంగా మారిందన్నారు.

ఈ పథకాన్ని రాష్ట్రంలోని అన్ని పార్టీలు సమర్థిస్తుంటే, ఒక్క వైఎస్ఆర్సిపి కి చెందిన ప్రతినిధులు మాత్రమే లేనిపోని విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రయాణీకుల భద్రత దృష్ట్యా కొండ ప్రాంతాల్లోని ఘాట్ రోడ్లలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి తొలుత అనుమతించలేదని, లిఅయితే ఘాట్ రోడ్లలో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని ఆమె తెలిపారు. లి ఈ విషయంలో ప్ర ధా న ప్రతి పక్ష పార్టీ సభ్యులు అక్కసుతో చేస్తున్న విమర్శల్లో ఏమాత్రం నిజంలేదని ఆమె స్పష్టం చేశారు.

ఉత్తరాంధ్ర జిల్లాలో భారీ వర్గాల కారణంగా నేడు అంగన్ వాడీలు అన్నింటికీ శెలవును ప్రకటించడం జరిగిందన్నారు. భారీ వర్షాల పరిస్థితులను బట్టి మంగళవారం అంగన్ వాడీలకు శెలవు ఇచ్చేది, లేనిది కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

రానున్న మూడేళ్లలో డోలీ రహిత గ్రామాలుగా గిరిజన గ్రామాలను తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. తొలి ఏడాదిలో రూ. 7,500 కోట్ల బడ్జెట్ ను గిరిజన సంక్షేమానికి కేటాయించడం జరిగిందని, అందులో ఇప్పటికే రూ. 1,300 కోట్లను వెచ్చించి దాదాపు 60-70 శాతం గ్రామాలకు రోడ్ల సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని, రానున్న ముడేళ్లలో గిరిజన గ్రామాలు అన్నింటికీ రోడ్ల కనెక్టివిటీని కల్పించేందుకు ప్రణాళికా బద్దంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

## అంటువ్యాధులపై అప్రమత్తం



(మొదటి పేజీ తరువాయి)

అలసత్వానికి తావివ్వొద్దన్నారు. గతంలో నమోదైన కేసుల ఆధారంగా గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మండలాల వారీగా కేసుల నమోదు తీరుపై సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా చూసినట్లయితే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయన్నారు. గ్రామాల్లో పనిచేసే సీహెచ్ ఓలు జిల్లా అధికారులు నిర్దేశించిన సమయాల్లో తాగునీటి నమూనాలు, సేకరించి పరీక్షలు చేయడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నీటి ఫలితాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మున్సిపల్, పంచాయతీ, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా వైద్యుల సూచించిన మేరకు ప్రసవ తేదీలాధారంగా గర్భిణుల వివరాలు సేకరించి, వారికి వైద్య సేవలు సకాలంలో అందడంలో ఎటువంటి అవరోధం రాకుండా చూడాలని మంత్రి సర్యకుమార్ సూచించారు. ఇందుకు ఆశా, ఎ.ఎన్.ఎం.ల సహకారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గతానుభవాల్ని దృష్టిలో పెట్టుకుని చర్యలు పటిష్టంగా తీసుకుంటున్నామన్నారు. అవసరాలకనుగుణంగా వాడుకునేందుకు కూడా అంబులెన్సులను మ్యాపింగ్ చేసినట్లు వెల్లడించారు.

## వాయుగుండం.. అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కృష్ణా, గోదావరి నదులకు వరద ఉధృతి అధికంగా ఉన్నందున లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆదేశించామని మంత్రి సత్యప్రసాద్ వెల్లడించారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. వరద విపత్తును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, అవసరమైన సహాయక చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు .

## డాటా సిటీ ఏర్పాటుకు సహకరించండి



(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ లో ఐపిని కాపాడుతూ పరివర్తనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వీలుగా ఎఐ శిక్షణ, టెక్స్ట్ అండ్ డాటా మైనింగ్ మినహాయింపుల కోసం సెక్షన్ - 52కి కాపీరైట్ చట్టసవరణ చేపట్టాలి.

భారతదేశంలో మొట్టమొదటి జాతీయస్థాయి క్వాంటమ్ క్లస్టర్ గా అమరావతి క్వాంటమ్ వ్యాలీ పార్కును, రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ కు నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా అధికారికంగా కేంద్రస్థాయి ఆమోదం తెలపాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. క్వాంటమ్ వ్యాలీకి రూ. 1000 కోట్లు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు రూ. 300 కోట్లు సాయం అందించండి. రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ను సెంట్రల్ ఇన్నొవేషన్ అండ్ డిజిటల్ హెల్త్ మిషన్ లో చేర్చండి. అమరావతిలో గ్లోబల్ క్వాంటమ్ సమ్మిట్, ఇండియా ఇన్నోవేషన్ వీక్ - 2026ను నిర్వహణకు అవకాశం కల్పించండి. అమరావతిలో నేషనల్ క్వాంటమ్ రిసెర్చి ఇనిస్టిట్యూట్, ఐఐటి/ఐఐఎస్ సి సహకారంతో నేషనల్ క్వాంటమ్ మిషన్ ఆధారిత డీప్ టెక్ స్కిల్ అకాడమీ ఏర్పాటు చేయండి. జాతీయ విద్యావిధానం - 2020 కింద ఫెలోషిప్ ప్రోగ్రామ్ లు, ఎఐ యూనివర్సిటీ, పాఠశాల స్థాయిలో స్టెమ్ పాఠ్యాంశాలను ఏకీకృతం చేయడానికి కేంద్ర సహకారం అందించండి. డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్లోబల్ డాటా సెంటర్ల పెట్టుబడులను ఆకర్షించడానికి విశాఖపట్నంలో సముద్రగర్భ కేబుల్ ల్యాండింగ్ పనులను వేగవంతం చేయండి. ఎలక్ట్రానిక్స్ తయారీ, సెమీ కండక్టర్స్, డిస్ప్లే ఫ్యాబ్ లు, గ్లోబల్ ఐటి సామర్థ్యాల కోసం ఎపి ప్రభుత్వం 2024-25లో ప్రకటించిన నూతన విధానాన్ని వివరిస్తూ విశాఖపట్నంలో ఐటి పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రోత్సహకాలను అందించాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు.

ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటుచేసిన ప్రతిష్టాత్మక ఇన్నొవేషన్ ఎకోసిస్టమ్, డేటా ఇంటిగ్రేషన్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, AI & డీప్ టెక్, విజువల్ ఇంటెలిజెన్స్, పీపుల్ పర్సెప్షన్, పబ్లిక్ అలర్ట్ ప్లాట్‌ఫామ్‌ల పనితీరును ఈ సందర్భంగా మంత్రి లోకేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తమ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టుల్లో డేటా లేక్, RTGS లెన్స్, P-GRS, CPGRAMS, అన్నదాత సుఖీభవ, డ్రోన్ మార్ట్, KPI డాష్‌బోర్డ్‌లు, AWARE ప్లాట్‌ఫామ్, ఉద్యోగుల పనితీరు ట్రాకింగ్ సాధనాలు ఉన్నాయని చెప్పారు. డేటా సెంటర్ పార్కు, క్వాంటమ్ వ్యాలీ, ఆర్ టిఐహెచ్ లను వికసిత్ భారత్ -2047లో అంతర్భాగాలుగా బ్రాండింగ్ చేసేందుకు, ఆంధ్రప్రదేశ్ ను జాతీయస్థాయి ఆవిష్కరణల్లో ముందంజలో ఉంచేందుకు కేంద్రం మద్దతు అందించాల్సిందిగా కోరారు. సమగ్ర డిజిటల్ నైపుణ్య పెంపుదల, ఇ-గవర్నెన్స్, డీప్ టెక్ పరిశోధన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న స్టెమ్ విద్య కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ర్యాపిడ్ టెక్ ఇంక్యుబేషన్, క్వాంటమ్, బయోటెక్, గ్రీన్ టెక్నాలజీ రంగాల్లో ఎంఎస్ఎంఇల ప్రోత్సాహానికి ఎపిలో సంస్కరణలను అమలు చేసేందుకు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ అంగీకారం తెలిపారు.

## రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ

(మొదటి పేజీ తరువాయి)



ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తో కలిసి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ 275 ద్వారా ఈ నెల 13 న నూతన మద్యం పాలసీ విడుదల చేసిందన్నారు. సెప్టెంబర్ 1, 2025 నుంచి మద్యం పాలసీపై రాష్ట్రంలో కొత్త విధానం అమల్లోకి వస్తుందన్నారు. 1 సెప్టెంబర్, 2025 నుంచి 31 ఆగస్టు, 2028 వరకు ఈ విధానం వచ్చే మూడేళ్ల పాటు రాష్ట్రంలో అమలులో ఉంటుందన్నారు. గతంలో వేలం వేయడం ద్వారా బార్లను కేటాయించగా, ఇప్పుడు లాటరీ పద్ధతిని అమలు చేస్తున్నామన్నారు. దీనికోసం 840 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కొత్త విధానంలో ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు తెరిచి ఉంటాయన్నారు. ప్రస్తుత పాలసీ ప్రకారం రాత్రి 11 గంటల వరకు మాత్రమే బార్లు తెరిచి ఉండేవన్నారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ. 35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ. 55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ. 75 లక్షల చొప్పున బార్ల లైసెన్స్ ఫీజు కట్టాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఏడాది 10 శాతం లైసెన్స్ ఫీజు అన్ని కేటగిరీలకు పెరుగుతుందన్నారు. గీత కార్మికుల కులాల కోసం 10 శాతం బార్లను రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ చేసిందన్నారు. వీటికి సాధారణ బార్ ల లైసెన్సు రుసుముల్లో 50 శాతం తక్కువగా రుసుముగా ఉండనుందన్నారు. అన్ని బార్లను లాటరీ పద్ధతిన జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో తీయడం జరుగుతుందన్నారు.

గతంలో బార్ లైసెన్స్ పొందాలంటే రెస్టారెంట్ లైసెన్స్ ముందే ఉండాల్సి ఉండేదన్నారు. ఈ సారి ఈ నిబంధనను సడలించడం జరిగిందన్నారు. 15 రోజుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేసుకునే సౌలభ్యాన్నిప్రభుత్వం కల్పించింది కాని కొన్ని సందర్భాల్లో ఇంకో 15 రోజుల్లోగా రెస్టారెంట్ ఏర్పాటు చేసుకునే సౌలభ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రతి ఏడాది 10 శాతం ఫీజు పెంచుతామన్నారు. గతంలో ఒకేసారి ఆగస్ట్ లోపు లైసెన్స్ ఫీజు కట్టాల్సి ఉండేదన్నారు. ఈసారి 6 సార్లుగా చెల్లింపులు చేయవచ్చన్నారు. ఇవాల్టి నుంచి ఈ నెల 26 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28 న లాటరీ తీసి బార్లు కేటాయిస్తామన్నారు. ధరఖాస్తుదారులు అప్లికేషన్లను ఆన్ లైన్, ఆఫ్ లైన్, హైబ్రిడ్ మోడ్ లోనూ ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంతో పారదర్శకంగా బార్ పాలసీ తీసుకురావడం జరుగుతుందన్నారు. కొత్త వారు ఈ బిజినెస్ లోకి రావడానికి కొన్ని మార్పులు చేశామన్నారు. గతంలో బార్లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండేవన్నారు. ఈసారి ఉదయం 10 నుంచి రాత్రి 12 వరకు బార్లకు అనుమతి ఉంటుందన్నారు. అన్ని కేటగిరీలో అప్లికేషన్ ఫీజు 5 లక్షలు గా నిర్ణయించామన్నారు. గతంలో కేటగిరీల బట్టి 7.5 లక్షలు, 10 లక్షల వరకు బార్ల అప్లికేషన్ ఫీజు ఉండేదన్నారు. కొన్ని చోట్ల మద్యం సిండికేట్లు కొత్త వారిని రాకుండా చేసే అవకాశం ఉందని, వాటిని ఆపేందుకు కొత్త నిర్ణయాలు తీసుకున్నామన్నారు. గతంలో కంటే లైసెన్స్ ఫీజు 70 నుంచి 50 శాతానికి తగ్గాయన్నారు. ఎయిర్ పోర్ట్‌లో బార్ల లైసెన్స్ కు ప్రభుత్వం నుంచి త్వరలో గైడ్ లైన్స్ రావాల్సి ఉందన్నారు.

## జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంపై ఉద్యోగుల ఆశలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నేడు (20వ తేదీన) జరగబోయే రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం కీలకమని గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాష పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సంక్షేమానికి అనుగుణంగా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

ఉద్యోగుల సమస్యలపై చిత్తశుద్ధితో పరిష్కారం కనుగొనాలంటే క్యాబినెట్ సబ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులకు వెంటనే 29 శాతం ఐఆర్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాక, 12వ వేతన సవరణ కమిటీని రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని సూచించారు.

రాష్ట్ర ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రూ. 25 వేల కోట్ల బకాయిలకు చట్టబద్ధత కల్పించి చెల్లింపులు జరపాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై సానుకూలంగా చర్చించాలన్నారు. ఉద్యోగుల సంక్షేమం చూడటం ప్రభుత్వ బాధ్యతేనని, ప్రజలతో పాటు ఉద్యోగులను కూడా సమానంగా గౌరవించాలని చాంద్ బాష అభిప్రాయపడ్డారు. నేడు జరగబోయే రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంపై ఉద్యోగులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారని జిల్లా ఐక్యవేదిక చైర్మన్ తెలిపారు.

## పారదర్శకంగా ఎరువుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కు రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు మొత్తం 16.73 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా ఉందని, వాటిలో (యూరియా 6.22 లక్షల మెట్రిక్ న్నులు, డి.ఏ.పి - 2.60 లక్షల మెట్రిక్ టన్నులు, ఎం. ఓ పి - 0.70 లక్షల మెట్రిక్ టన్నులు, యస్ యస్ పి - 0.94 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ లు %-% 6.30 లక్షల మెట్రిక్ టన్నులు) అవసరం ఉందని కమిషనర్ ఢిల్లీరావు మంత్రికి వివరించారు. కేంద్రం నుండి ఆగస్ట్ నెలకు సంబంధించి రావల్సిన ఎరువులు రాష్ట్రానికి సరైన సమయంలో అందలేదని దాంతో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి ఇప్పటివరకు 10.39 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చాయని, ప్రారంభ నిల్వలు 7.13 లక్షల మెట్రిక్ టన్నులతో కలిపి మొత్తం 17.53 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులను రాష్ట్రంలోని రైతులకు అందుబాటులో ఉంచామని, 10.96 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందచేశామని, 6.56 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంస్థలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద అందుబాటులో ఉన్నాయని మంత్రికి అధికారులు తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర



వ్యాప్తంగా ఎరువులను రైతులకు సకాలంలో అందచేశాం, అయినా కూడా పలు ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇది పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైతే రైతులు ఇబ్బందులు పడుతున్నారో వెంటనే గుర్తించి ఆయా ప్రాంతాలకు మార్క్ ఫెడ్ గోదాములలో నిల్వలు ఉన్నటువంటి ఎరువులను త్వరితగతిన జిల్లాలలోని సహకార సంస్థలకు పంపాలని ఆదేశించారు. ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధరలకు యూరియాను, డీఏపీని అమ్ముకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి రావల్సిన పెండింగ్ ఎరువుల విషయంపై కేంద్ర మంత్రి నడ్డాను వేగంగా ఎరువులను అందచేయాలని కోరారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన ఎరువులు ఆర్ ఎఫ్ సీ రామగుండం నుండి 19,000 మెట్రిక్ టన్నులు , కాకినాడ పోర్ట్ కు రావాల్సిన ఎరువులు కనీసం 30,000 మెట్రిక్ టన్నులు, గంగవరం పోర్ట్ కు రావాల్సిన 18,500 మెట్రిక్ టన్నుల ఎరువులను కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి వచ్చేలా చర్యలు చేపడతామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వేగవంతంగా జిల్లాలకు యూరియా అందేలా చర్యలు తీసకుంటామని, 3 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా యూరియా అందుబాటులో ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. కావాలని యూరియా కొరత సృష్టిస్తే ఎవరిని ఉపేక్షించమని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ జేడీ కృపదాస్, మార్క్ ఫెడ్ జీఎం శ్రీనివాస్, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య అక్రమ బదిలీపై రాజకీయాలు ఆపాలి

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** : శ్రీకాకుళం జిల్లా పొందూరులో కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య అక్రమ బదిలీపై అధికార-ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సరైంది కాదని ఏపీ సమగ్రశిక్షా ఎంప్లాయిస్ జేఏసీ తీవ్రంగా విమర్శించింది. ఉద్యోగ సంబంధిత అంశాన్ని రాజకీయ రగడగా మలచి ఉద్యోగిని మానసికంగా వేధించడం దారుణమని పేర్కొంది.

గౌరవ ముఖ్యమంత్రి సైతం ఎంఎల్ఏ వైఖరి తప్పు అని పత్రికా ముఖంగా ప్రకటించినా, అధికార పార్టీ నేతలు సోషల్ మీడియాలో సౌమ్య వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ కించపరిచేలా ట్రోల్ చేస్తున్నారని జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. మరోవైపు ప్రతిపక్ష వైసీపీ కూడా ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం విచారకరమని విమర్శించింది. రాజకీయ పార్టీలు కలసి ఉద్యోగిని మానసికంగా ధ్వంసం చేసి ఆత్మహత్యకు నెట్టే పరిస్థితి సృష్టించడాన్ని ఖండించింది.

ఈ అక్రమ బదిలీని తక్షణమే ఆపాలని, బాధ్యత వహించాల్సిన శ్రీకాకుళం జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ను వెంటనే విధుల నుండి తొలగించి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని జేఏసీ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని బాధితురాలికి న్యాయం జరిగేలా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ హానరరీ చైర్మన్ ఏ.వి. నాగేశ్వరరావు, చైర్మన్ బి.కాంతారావు, ప్రధాన కార్యదర్శి యు.కళ్యాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాన్ మోడి సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

## వర్షాలపై సీఎస్‌తో సీఎం సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కుండపోతగా కురుస్తున్న వర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌తో సోమవారం సచివాలయంలో సమీక్షించారు. అల్పపీడనం వాయుగుండంగా మారుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేయాలని సిఎస్‌కు సూచించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో పలుచోట్ల నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించడం, కొండప్రాంతాలు కోతలకు గురికావడంతో అధికారులు ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భారీ వర్షాలు కొనసాగితే విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలని సూచించారు. ప్రజలకు సమాచారం అందించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని... అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సిఎం అన్నారు. ముందస్తు సన్నద్ధతతో, అప్రమత్తతో ప్రాణ, ఆస్థి నష్టం లేకుండా చూడాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు.

## లంచానికి ఆశపడి ..

**భారీ మూల్యం చెల్లించుకోనున్న జిల్లా వైద్యాధికారి**

**రూ.30,000 లంచం తీసుకున్నట్లు ఎసిబి ప్రత్యేక కోర్టు నిర్ధారణ**

**తక్షణమే పెన్షన్, గ్రాట్యుటీ చెల్లింపులు నిలిపివేయాలని మంత్రి ఆదేశం**

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** గతంలో కర్నూలు జిల్లా వైద్యారోగ్య అధికారి(డిఎంహెచ్ ఓ)గా పనిచేస్తూ రూ. 30,000 లంచానికి ఆశపడిన ఒక డాక్టరుకు నేడు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. 2017లో ఆ అధికారి ఒక ప్రైవేట్ ఆసుపత్రి మరియు స్కానింగ్ సెంటర్ సేవల కొనసాగింపునకు( రెన్యువల్) లంచం అడిగినట్లు సమాచారం అందడంతో అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

ఈ విషయంలో ఎసిబి 2019లో నమోదు చేసిన కేసుపై విచారణ చేపట్టిన కర్నూలు ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం గత నెల ఇచ్చిన తీర్పులో సదరు వైద్యాధికారి లంచం తీసుకున్నట్లు నిర్ధారించింది. ఈ నేపథ్యంలో 2020లో పదవీ విరమణ చేసిన సదరు అధికారికి నియమాల ప్రకారం పింఛను మరియు గ్రాట్యుటీ చెల్లింపులను తక్షణమే నిలిపివేయాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఆదేశాలిచ్చారు.

ముడుపుల ఆరోపణలో న్యాయస్థానంలో విచారణ ఎదుర్కొంటున్న ఆ అధికారి 2020లో పదవీ విరమణ చేశారు. నియమాల ప్రకారం ఆ అధికారికి పింఛను మొత్తంలో 75 శాతాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. వైద్యారోగ్య శాఖామంత్రి ఆదేశాలతో ఈ నెల నుంచి పెన్షన్ చెల్లింపును నిలిపివేస్తారు. ఆంధ్రప్రదేశ్ సవరించిన పెన్షన్ నిబంధనలు,1980 ప్రకారం ముడుపుల కేసుల్లో దోషులుగా నిర్ధారణ అయిన వారికి పింఛను, గ్రాట్యుటీ చెల్లింపులు చేయబడవు.

2020లో నమోదైన ఈ కేసులో సదరు కర్నూలు జిల్లా వైద్యారోగ్య అధికారిని గత నెలలో దోషిగా నిర్ధారించి ఒక ఏడాది పాటు కఠిన కారాగార శిక్షను, రూ. 10,000 జరిమానాను కర్నూలు ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం విధించింది. ప్రస్తుత నియమాల ప్రకారం 62 ఏళ్లకు పదవీ విరమణ చేసిన డిఎంహెచ్‌ఓలకు జీవితకాలం నెలకు సుమారు రూ. 1,00,000కు పైగా పెన్షన్ పొందే అవకాశముంది. దీంతోపాటు సుమారు రూ. 20 లక్షలు గ్రాట్యుటీ అందుతుంది. రూ. 30,000 లంచానికి ఆశపడిన సదరు కర్నూలు జిల్లా వైద్యారోగ్య అధికారి ఈ మొత్తాన్ని కోల్పోయే పరిస్థితి ఎదురైంది.

## మేమున్నామని.. మీకేంకాదని..



**ముగ్గురికి రూ.9 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల మంజూరు**

**స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** పేదల గుండెకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోంది. చిన్న కష్టమొచ్చినా తానున్నానంటూ ఆపన్నహస్తం అందిస్తోంది. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తోంది. ఎమ్మెల్యే నసీర్ సోమవారం స్వయంగా సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారుల గృహాలకు వెళ్లి రూ. 9 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. పాత గుంటూరుకు చెందిన పుప్పుల సంజన, బాలాజీ నగర్ పదో లైనుకు చెందిన మల్లాది కాంతారావు, గౌడాస్ కాలనీకి చెందిన షేక్ మాబు చాన్ అనారోగ్యానికి గురి కావడంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకున్నారు. వీరికి వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు కావడంతో అప్పులు చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆయా కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వీరికి సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే నసీర్ స్వయంగా లబ్ధిదారుల స్వగృహాలకు వెళ్లారు. పప్పుల సంజనకు రూ. 5 లక్షలు, మల్లాది కాంతారావుకు రూ. 2 లక్షలు, షేక్ మాబు చాన్ కు రూ. 2 లక్షలు చొప్పున సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ అపర సంజీవని అని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ కు కూడా కొర్రీలు పెట్టేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వైద్యానికి పెద్ద పీట వేశారని తెలిపారు. ఎవరికి ఆపద వచ్చినా తాము అండగా నిలుస్తామని, అనారోగ్యంతో ఏ ఒక్కరూ బాధ పడకూడదని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం సమానంగా ప్రగతి పథంలో పయనిస్తున్నాయని తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమ కుటుంబాలను దేవుడిలా ఆదుకున్న సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కు రుణపడి ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పఠాన్ జమీర్, డివిజన్ అధ్యక్షులు ఉస్మాన్, రియాజ్, డిప్యూటీ మేయర్ గౌస్, మజారుద్దీన్, రియాసిత్, మల్లికా, తుళ్లూరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోండి

కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో నారా లోకేష్ భేటీ

**న్యూఢిల్లీ:** విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కానూరు – మచిలీపట్నం నడుమ 6లైన్ల రోడ్డు విస్తరణకు వెంటనే ఉత్తర్వులు జారీచేయాలని కేంద్ర ఉపరితల రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ న్యూఢిల్లీలో కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడతూ... ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కానూరు – మచిలీపట్నం రోడ్డు విస్తరణ ద్వారా విజయవాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు రాజధాని ప్రాంత అభివృద్ధికి కూడా ఉపకరిస్తుంది. హైదరాబాద్ – అమరావతి మధ్య కనెక్టివిటీలో ఎన్ హెచ్ – 65 కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే మంజూరైన హైదరాబాద్ – గొల్లపూడి రహదారి విస్తరణ ప్రాజెక్టును అమరావతితో అనుసంధానించేలా అదనపు పోర్టు లింకేజిని డిపిఆర్ లో చేర్చండి. విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకారం అందించండి.

ఎన్ హెచ్ – 16 వెంట విశాఖపట్నంలో 20 కి.మీ.లు, విజయవాడలో 14.7 కి.మీ.ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ప్లస్ మెట్రో కారిడార్లను నాగపూర్ మోడల్ లో అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఎన్ హెచ్‌ఎఐ, రాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ ఉమ్మడి భాగస్వామ్యంతో డిపిఆర్ రూపకల్పన, వ్యయాన్ని భరించే అంశంపై చర్చ జరిగింది. ఎపిలో రీజనల్ కనెక్టివిటీ, డెవలప్ మెంట్ కారిడార్ల అభివృద్ధిలో భాగంగా కర్నూలు – ఎమ్మిగనూరు రహదారి విస్తరణ, బైపాస్ రోడ్డు నిర్మాణం, వినుకొండ–గుంటూరు నడుమ ఎన్ హెచ్ 544డి, కాకినాడ పోర్టు – ఎన్ హెచ్ 216 నడుమ దక్షిణ రహదారి, కాణిపాక వినాయక దేవాలయం లింకు రోడ్డు నిర్మాణ పనుల చేపట్టాల్సిందిగా కోరారు.

బెంగుళూరు – చెన్నయ్ (ఎన్ఇ–7) రహదారికి డైరక్టర్ కనెక్టవిటీ కోసం కుప్పం–హొసూరు – బెంగుళూరు



నడుమ 56 కి.మీ.ల మేర రూ. 3వేల కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేగంగా అనుమతులు మంజూరు చేయాలని లోకేష్ కేంద్రమంత్రికి విన్నవించారు. కుప్పం ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (కాడా) ప్రాంతంలో పారిశ్రామిక పార్కు అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్... గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు భద్రతా ప్రమాణాల మెరుగుదల, ట్రాఫిక్ రద్దీ నిర్వహణ, లాజిస్టిక్స్, పాసింజర్ కారిడార్ల ఇంటిగ్రేషన్ ఆవశ్యకతను వివరించారు. కేంద్రప్రభుత్వ సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతమైన భూసేకరణకు ఎపి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. స్థిరమైన మోడరన్ కనెక్టివిటీ కోసం గ్రీన్ కారిడార్లు, అధునాతన టోలింగ్, రియల్ టైమ్ ట్రాఫిక్ సమాచార వ్యవస్థల అభివృద్ధిలో కేంద్రం భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

**షిప్ బిల్డింగ్ యూనిట్ అభివృద్ధి చేయండి**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ లో కీలకమైన మారిటైమ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, పోర్టుల ఆధారిత అభివృద్ధి, జలరవాణా ప్రాజెక్టులకు సహకారం అందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర షిప్పింగ్, ఓడరేవులు, జలరవాణా శాఖల మంత్రి సర్బానంద సోనవాల్ తో మంత్రి నారా లోకేష్ నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ...



ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద హామీ ఇచ్చిన దుగ్గిరాజపట్నం ఓడరేవును వేగవంతం చేయండి. దుగరాజపట్నం నౌకానిర్మాణం, ఓడరేవు క్లస్టర్ అభివృద్ధి కోసం గుర్తించారు. అక్కడ ప్రధాన ఓడరేవుతోపాటు 2వేల ఎకరాల్లో రూ. 3,500 కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణం, మరమ్మతు కేంద్రం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. పోర్టు అనుబంధరంగాల్లో రూ. 26వేల కోట్ల పెట్టుబడులు, 5వేల ప్రత్యక్ష, 30వేల పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయి. దీనిద్వారా నెల్లూరు జల్లా ఆర్థివృద్ధిని పెంచుతుంది. దుగరాజపట్నం పోర్టుకు రాష్ట్ర ఈక్విటీగా భూమిని ఇప్పటికే సేకరించి ఇచ్చాం, ఎస్ పివి మోడల్ లో ప్రపంచస్థాయి భాగస్వాములను ఆకర్షించి పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానించాలన్నది ఎపి ప్రభుత్వ లక్ష్యం. సాగర్ మాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో రూ. 1.14లక్షల కోట్ల విలువైన 110 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ యాంకరేజి పోర్టుల్లో వార్ఫ్ లు, స్లిప్ వేల అప్ గ్రేడ్, జీవవైవిధ్యం కోసం రూ. 200 కోట్లు మంజూరు చేయండి. గోదావరి – కృష్ణానదులపై కొత్త జలరవాణా మార్గాలు, కార్గో టెర్మినల్స్, ఫ్లోటింగ్ జెట్టీల అభివృద్ధికి రూ. 127.5 కోట్లు మంజూరు చేయండి. పోర్టుల్లో రవాణా కార్యకలాపాల అభివృద్ధికి ఆయా పోర్టులకు అనుసంధానంగా మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేష్



విజ్ఞప్తిచేశారు.

రివర్ టూరిజంను ప్రోత్సహించడంలో భాగంగా అమరావతి–విజయవాడ స్ట్రెచ్ తో సహా పట్టణ జలమార్గాలను అభివృద్ధి చేయాలని ఎపి ప్రభుత్వం భావిస్తోంది. పిపిపి మోడల్ లో చేపట్టే ఈ ప్రాజెక్టుల వల్ల రోడ్ల రద్దీని తగ్గించడమేగాక సరుకును జలమార్గాలకు మోడల్ షిఫ్ట్ ను సులభతరం చేస్తాయి. ఎపిలోని తీరప్రాంతంలో పోర్టు ఆధారిత అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, గ్లోబల్ కాంపిటీటివ్ నెస్ పై దృష్టిసారించాం, ఎపిలో సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చే ఈ ప్రాజెక్టులకు కేంద్రం సహాయం అందించడంతోపాటు అనుమతలు మంజూరు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు.

**నిర్మలా సీతారామన్‌తో మంత్రి లోకేష్ భేటీ**

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదారంగా ఆర్థిక సాయం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల పురోగతిని వివరించిన లోకేష్...ఎపిలో కొత్త ప్రాజెక్టులకు సహకారం అందించాల్సిందిగా నిర్మలా సీతారామన్ కు విజ్ఞప్తిచేశారు.

## మౌలిక వసతుల కల్పనకు.. రూ.904 కోట్లు

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర రాజధాని అమరావతి కోర్ క్యాపిటల్ పరిధి గల 29 గ్రామాల్లోని గ్రామ కంఠాల్లో రూ. 904 కోట్ల అంచనా వ్యయంతో మౌలిక వసతుల కల్పనకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం తెల్పినట్లు రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన 51 వ సీఆర్డీఏ సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగిందని, ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు సంబంధించిన పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అమరావతి కోర్ క్యాపిటల్ పరిధిలోని గ్రామ కంఠాల్లో త్రాగునీటి సరఫరా విషయంలో ఉన్న 30 శాతం గ్యాప్ ను పూరించేందుకు రూ. 64.35 కోట్లు, మురుగునీటిని శుద్ధి పర్చి బయటకి పంపే విషయంలో ఉన్న 100 శాతం గ్యాప్ ను పూరించేందుకు రూ. 110.72 కోట్లు, 40 శాతం మేర ఉన్న రహదారుల గ్యాప్ ను పూరించేందుకు రూ. 339.04 కోట్లు, వీది దీపాల విషయంలో ఉన్న 10 శాతం గ్యాప్ ను పూరించేందుకు రూ. 12.25 కోట్లు మరియు మిగిలిన సొమ్మును ఏడు సంవత్సరాల పాటు ఆపరేషన్ %డ% నిర్వహణ ట్యాక్సు చెల్లింపుకు వెచ్చించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 21 వ తేదీన జరుగనున్న క్యాబినెట్ లో ఈ పనులకు ఆమోదం పొంది వెంటనే టెండర్లను పిలవడం జరుగుతుందని తెలిపారు.

రాజదాని ప్రాంతంలో అభివృద్ధి పనులను విస్తృత స్థాయిలో చేపట్టడం జరిగిందని, ఆయా పనులను ఏడిసి, సిఆర్డిఏ ల ఆద్వర్యంలో నిర్వహించడం జరుగుచున్నదన్నారు. అయితే మరికొన్ని నూతన ప్రాజక్టులను గ్రీన్ ఫీల్డు ఎయిపోర్టు, ఎస్.టి.ఆర్. విగ్రహం, స్మార్టు ఇండస్ట్రీస్, ఐకానిక్ బ్రిడ్జి, స్పోర్ట్సు సిటీ, రివర్ ఫ్రెంట్, రోప్ వే, ఐ.ఆర్.ఆర్. తదితర పనుల నిర్వహణకు ప్రత్యేక ఎస్.పి.వి.ని ఏర్పాటు చేసేందుకు సిఆర్డిఏకు అనుమతిని ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని కూడా క్యాబినెట్ లో పెట్టి ఆమోదం పొంది ముందుకు పోవడం జరుగుతుందన్నారు. మంగళగిరిలో 78.01 ఎకరాల్లో గోల్డు క్లస్టర్ ఏర్పాటు చేసి ఆ క్లస్టర్ లో దాదాపు రూ. 5 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే విధంగా జమ్స్ అండ్ జ్యూవలరీస్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించడమైందని, అందుకు ల్యాండ్ పూలింగ్ విదానంపై అస్సైనీ భూములను సేకరించేందుకు సిఆర్డిఏకు అనుమని



ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పార్కు ద్వారా ప్రత్యక్షంగా 20 వేల మందికి మరియు పరోక్షంగా ఎన్నో వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశలు కలుగనున్నాయన్నారు. ల్యాండ్ పూలింగ్ లో ఎస్సైనీ, పట్టా భూములను కూడా సేకరించడం జరుగుచున్నదని, అయితే ఆయా భూములకు జారీ చేసే సర్టిఫికేట్లలో ఎస్సైనీ భూమి అని స్పష్టంగా మెన్షన్ చేయవద్దని భూదాతలు చేస్తున్న విజ్ఞప్తికి రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఎస్సైనీ అనే పదాన్ని తొలిగించాలని ఆదేశించారని మంత్రి తెలిపారు.

అమరావతి రాజధాని ప్రాంతంలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నీటిని బయటకు పంపేందుకు రూ. 411.53 కోట్లతో ఒక ప్యాకేజీకి మరియు త్రాగునీటిని డిస్ట్రిబ్యూట్ చేసేందుకు రూ. 376.60 కోట్లతో మరో ప్యాకేజీకి సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం తెల్పడం జరిగిందని మంత్రి తెలిపారు. మహాలక్ష్మీ హొటల్ కన్సార్షన్ కు ఒక ఎకరం మరియు గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎస్.ఆర్.ఎం. కు మరియు విట్ కు మరో వందేసి ఎకరాలు ఇప్పడు ఇచ్చేందుకు ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. ఈ అంశాన్ని కూడా 21 న జరుగబోయే క్యాబినెట్ లో పెట్టి ఆమోదం పొందడం జరుగుతుందన్నారు.

పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాదానం చెపుతూ మార్చి 31 కల్లా దాదాపు 4 వేల గృహాలను పూర్తి చేసి అధికారులకు అప్పగించడం జరుగుతుందన్నారు. వచ్చే మూడున్నరేళ్లలో ప్రధాన రహదారులు, వాటి అనుబంధ పనులను మరియు రెండున్నరేళ్లలో లేఅవుట్లలోని అన్ని పనులను పూర్త చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

## పర్యాటకానికి నిధులు!

(మొదటి పేజీ తరువాయి)

అదే విధంగా ప్రపంచ స్థాయి హోదా కల్పనలో భాగంగా యూనెస్కో జాబితాలో లేపాక్షికి గుర్తింపు అంశంపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటకులకు మధురమైన అనుభవాలకు కల్పించేందుకు ఆంధ్ర కశ్మీర్ గా పేరొందిన లంబసింగిలో ఎక్స్పీరియన్స్ సెంటర్, బౌద్ధ వారసత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో తొట్లకొండ, నాగార్జున కొండ తదితర బుద్దిస్ట్ సర్క్యూట్ లలో టెంట్ సిటీలు, చారిత్రక, వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన లేపాక్షిలో కల్చరల్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రికి సమర్పించినట్లు తెలిపారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో పర్యాటకుల వసతి వ్యవధి పెరుగుతుందని, స్థానికంగా ఉపాధి కలుగుతుందని తెలిపారు. వీటన్నింటికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

లలిత కళలను ప్రోత్సహించేందుకు, యువ కళాకారులకు మద్దతుగా విశాఖపట్నంలో లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రిని అభ్యర్థించినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలు చేసేందుకు విజయవాడలోని జీవీఆర్ మ్యూజిక్, డ్యాన్స్ కాలేజీలో కళాక్షేత్ర ఆడిటోరియం నిర్మాణం, రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో తెలుగు భాష, సాహిత్యాన్ని, సంగీత, నృత్య, నాటక కళలను సంరక్షించేందుకు, ప్రోత్సహించేందుకు, రచయితలకు అవకాశాలు కల్పించేందుకు సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా అభ్యర్థించానన్నారు.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు సూర్యరాయ ఆంధ్ర నిఘంటువును పునర్ముద్రించాలని, భవిష్యత్ తరాలకు అందజేయాల్సిన అవసరాన్ని వివరించానని తెలిపారు. అదే విధంగా సింగపూర్ విజిటర్ సెంటర్, దుబాయ్ టూరిజం హబ్ ల మాదిరిగా రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాలు, సందర్శకుల సౌకర్యాలు మరింత బలోపేతం చేసేందుకు,అంతర్జాతీయ పర్యాటక డెస్క్ లు, ప్రధాన పర్యాటక అగ్రిగేటర్లకు స్థలాలు, వీసా ఫెసిలిటేషన్ కౌంటర్లు ఏర్పాటు కోసం రూ. 100 కోట్లతో



అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్ పీరియన్స్, ఇంటర్ ప్రెటేషన్ మరియు ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఏపీటీఐఎఫ్ సీ) ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరానన్నారు. ఇప్పటికే ఈ విషయమై అమరావతిలో 5 ఎకరాల భూమికి సీఎం చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రికి మంత్రి దుర్గేష్ వివరించారు. పై అభ్యర్థలకు త్వరితగతిన నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్రమంత్రిని రాష్ట్ర మంత్రి దుర్గేష్ కోరారు.

భేటీలో భాగంగా రాజమహేంద్రవరం లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, అమరావతిలో పర్యాటక భవన్ అంశం చర్చకు వచ్చిందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. అదేవిధంగా గతంలో సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకించి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకొని సంబంధిత పర్యాటక ప్రాంతాల అభివృద్ధి అంశాన్ని ఈ సందర్భంగా కేంద్రమంత్రితో మంత్రి దుర్గేష్ చర్చించారు.

అనంతరం శాస్కి, స్వదేశీ దర్శన్ 2.0, ప్రసాద్ స్కీమ్ ల క్రింద ఏపీకి పర్యాటక ప్రాజెక్టులు మంజూరు చేసినందుకు మంత్రి దుర్గేష్ కేంద్రమంత్రి షెకావత్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రమద్దతు రాష్ట్ర పర్యాటకంపై ఎల్లవేళలా ఉండాలని కాంక్షించారు.

## నిబంధనలు సవరించాలి


**న్యూ ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం చిన్న జిల్లాలకు కూడా వర్తింప జేసి నిరుద్యోగ యువత, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సోమవారం పార్లమెంట్ లో నిరుద్యోగ యువత, విద్యార్థుల కోసం ప్రశ్నించారు. పార్లమెంట్ లో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకంలో యువత, విద్యార్థుల నుండి భారీ ఆసక్తి ఉన్నప్పటికీ, దానిలో తక్కువ భాగస్వామ్యం ఉందన్న కారణంగా అర్హులైన వారికీ న్యాయం జరగడం లేదన్నారు. ఈ పథకంలో ఉన్న ప్రస్తుత స్టైపెండ్ నిర్మాణం సరిపోదని, ముఖ్యంగా టైర్–1 నగరాల్లో ఉందని హైలైట్ చేసి, మద్దతును సవరించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. టైర్–2 నగరాలు, చిన్న జిల్లాలకు కూడా ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం వర్తించేలా సవరణ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు, దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా 7 లక్షల మంది అర్హులు కాగా, 6 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా కేవలం 8 వేల మందికి మాత్రమే



అవకాశాలు ఉన్నాయని, నా నంద్యాల జిల్లాలో 372 ఆఫర్లకు గాను 3000 వేల దరఖాస్థులు చేసుకోగా, 30 మందికి మాత్రమే అవకాశం ఉందని, నెలకు రూ. 5 వేల స్టైఫండ్ సరిపోదని, వీటిని కూడా పెంచాలని, వీటివల్ల అర్హులైన యువతకు సరైన న్యాయం జరగదని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకంలో సవరణలు చేసి, చిన్న జిల్లాలకు వర్తింపజేసి, నిధులు పెంచి అర్హులైన వారందరికీ సహాయం చేయాలని యువత కోసం పార్లమెంట్ లో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు.

## శ్మశాన వాటికలకు కొత్త రూపు

**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి నియోజకవర్గంలో ఒకప్పుడు చెట్లు, పుట్టల మధ్య దర్శనమిచ్చే శ్మశాన వాటికలు ఇప్పుడు కొత్తరూపును సంతరించుకుంటున్నాయి. మంత్రి నారా లోకేష్ కృషితో నియోజకవర్గంలోని అన్ని సామాజికవర్గాల శ్మశాన వాటికల రూపురేఖలు మారుతున్నాయి. మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో వడ్డేశ్వరం గ్రామంలో ఉన్న ఎనిమిది శ్మశాన వాటికలను అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేయించారు. ఆ అభివృద్ధి పనులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో ఉన్న అన్ని శ్మశాన వాటికలకు చుట్టూర ప్రహరీ గోడలు లేకపోవడంతో పాటు ఇతర సమస్యను గ్రామస్తులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన త్వరితగతన సొంత నిధులతో అభివృద్ధి పనులను చేయించారు. ప్రత్యేక నిర్మాణాలతో కూడిన చితులు, వెయిటింగ్ హాళ్లు, తాగునీరు, మరుగు దొడ్లు, స్నానపు గదులు వంటి సదుపాయాలతో అభివృద్ధి పనులు చేయించారు. కేశ ఖండనం, దుస్తులు మార్చుకునేందుకూ గదులతో పాటు బూడిద నిల్వ సౌకర్యం వంటివి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనితో గ్రామస్తులు మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో వడ్డేశ్వరంలో గ్రామంలో హిందూ, ముస్లిం, మాదిగ, మాల, గౌడ, రజక,



కన్వెర్టడ్, యాదవ–మరాఠి, సామాజికవర్గాల శ్మశాన వాటికలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అన్ని మతాలకు చెందిన శ్మశానవాటికలను మంత్రి నారా లోకేష్ దశల వారీగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చేస్తున్న అభివృద్ధి దేశంలోని ఏ నియోజకవర్గంలో కూడా చేయడం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈపూరి బాబు, నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు, ఎర్రగుంట్ల భాగ్యరావు, మల్లవరపు వెంకట్, షేక్ రియాజ్, వేమూరి మైనర్ బాబు, ఎండీ ఇబ్రహీం, కొల్లి శేషు, దాసరి కృష్ణ, కాంట్రాక్టర్ వెలగపూడి కిషోర్ బాబు, బొర్రా కృష్ణ వందన, షేక్ అక్రమ్, ఎస్.కె ఇబ్రహీం, యలమంచిలి పద్మజ, మద్దినేని సుబ్రహ్మణ్యం, జోరుగా దాసు, గుంపెన నాగేశ్వరరావు, షేక్ ఇమాంస, అంజుమన్, కమిటీ పెద్దలు, క్రిస్టియన్ పాస్టర్లు, గ్రామ పెద్దలు తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్ లేదు

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 18:** పదేపదే చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని, కేవలం తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఫార్మా సిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజాధనం వృధా అవుతుందని ఆయన ఆరోపించారు. ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. ఇది నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ, తాను రెండేళ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటోందని, చివరికి అధికారులు కూడా దీనిని అంగీకరిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మసిటీ కోసం 20,000 ఎకరాలతో ప్రతిపాదనలను తయారుచేసింది, స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమంది తమ భూములు ఇవ్వడం పైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రతి ఎకరాన్ని తిరిగి రైతన్నలకు ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు స్నేహితుల కోసం అవే భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని నిండా మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మా సిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించినా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని పక్కనపెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్ కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దీని వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

## ప్రభుత్వానికి తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 18(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని.. తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రైతులకు యూరియా కొరత లేకుండా, అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. వర్షాలు సకాలంలో రావడంతో జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండడంతో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని.. ఈ నేపథ్యంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో యూరియా కోసం సహకార సంఘాలు, డీలర్ షాపుల దగ్గర రైతులు బారులు తీరి నిలబడి ఉంటున్నారని అన్నారు.

సకాలంలో ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. యూరియా కొరతను అదునుగా చూపించి అనేకమంది డీలర్లు 40 కిలోల యూరియా బస్తాకు రూ. 267 వసూలు చేయాల్సి ఉండగా .. అదనంగా వసూలు చేస్తున్నట్లు రైతాంగం చెబుతున్నారని తెలిపారు.

కృత్రిమ కొరత సృష్టించి కూడా డీలర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్-జూన్ నెలలకు 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందని.. కానీ వాస్తవంగా కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే అందించిందన్నారు. దీంతో 1.94 లక్షల టన్నుల లోటు ఏర్పడిందన్నారు. .ప్రస్తుతం ఈ లోటు 2.24 లక్షల టన్నులకు పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియాను, ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు రైతాంగం పూనుకుంటుందన్నారు.

# సమస్య పునరావృతమైతే రాజగోపాల్‌రెడ్డి చర్యలు తప్పవు

## వరంగల్ పంచాయతీపై నలుగురు సభ్యుల కమిటీ

## పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, ఆగస్టు 18(జర్నలిస్ట్‌ఫైల్):** కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డికి పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం మల్లు రవి మీడియాతో మాట్లాడారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తనతో మాట్లాడారని చెప్పారు. చాలా సేపు చర్చించినట్లు తెలిపారు. సమస్య రిపీట్ కాకుండా ఒకసారి చెప్పి చూస్తాం, మళ్లీ రిపీట్ అయితే తప్పకుండా రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకుంటామని మల్లు రవి తెలిపారు. అనంతరం వరంగల్ పంచాయితీపై మల్లు రవి వివరణ ఇచ్చారు. వరంగల్‌కి నలుగురిని పంపించబోతున్నట్లు తెలిపారు. ఎవరెవరు వెళ్లాలి అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని అన్నారు. వరంగల్ జరుగుతున్న అంశాలపై సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కమిటీ వేయమని టిపిసిసి చీఫ్‌కు లేఖ రాశానని తెలిపారు. తాను పార్టీలో మంటలు పెట్టడానికి లేను, నా పని ఫైరింజన్ అని చెప్పారు. మంత్రి పదవి విషయంలో పదే పదే రాజ్ గోపాల్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యల్ని కమిటీ సీరియస్‌గా తీసుకుందన్నారు. ఇక మరోవైపు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా మురళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆయన వైఖరిపై క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. దీనిపైనా క్రమశిక్షణ కమిటీ సమావేశంలో చర్చించారు. గజ్వేల్ దగ్గర డిసిసి నర్సా రెడ్డిదాడి చేశాడని మా దృష్టికి వచ్చింది దానిపై వివరాలు సేకరించామన్నారు. నలుగురు సభ్యులతో కూడిన కమిటీశ్యాం మోహన్ కమిటీ కన్వీనర్‌గా ఉంటారు. వచ్చే మంగళవారం సమావేశమై రాజగోపాల్ రెడ్డి అంశంపై చర్చిస్తామని మల్లు రవి స్పష్టం చేశారు.

# రాష్ట్రానికి యూరియా అందజేతపై కేంద్రం తీరు బాగా లేదు

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 18(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రానికి యూరియా ఇచ్చే విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరు బాగాలేదని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వైఖరి కారణంగానే తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరత ఉందన్నారు. కేంద్రమంత్రి నడ్డాకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తాను ఐదారు సార్లు లేఖలు కూడా రాశానని తెలిపారు. యూరియా కొరత లేకుండా సరఫరా చేయాలని కేంద్రమంత్రి అధికారులను ఇచ్చారని, అయినప్పటికీ ఇంతవరకు మంత్రి చెప్పినట్లు ఎరువులు రాష్ట్రానికి సరఫరా కాలేదన్నారు. రాష్ట్రానికి ఖరీఫ్ సీజన్‌కు 9.80లక్షల మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందన్నారు. జులై వరకు 6.60లక్షల మెట్రిక్ టన్నులు యూరియా రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంది, కానీ ఇప్పటి వరకు ఇచ్చిన యూరియా కేవలం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అన్నారు. మకర్ ద్వారా ప్రొటెస్ట్ కూడా చేస్తాం....కచ్చితంగా రైతుల పక్షాన పోరాటం చేస్తాం...కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని అన్నారు.

# అలసత్వం వద్దు.. అంతా అప్రమత్తంగా ఉండండి

## పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంతో మంత్రి సీతక్క విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఆగస్టు 18(జర్నలిస్ట్‌ఫైల్):** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ సీతక్క ఆదివారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సమావేశంలో నివిది ఎన్. అశోక్‌తో పాటు చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడిన పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తూ, ఇప్పటివరకు మొత్తం 86.55 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని మంత్రికి నివేదించారు. ఈ రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు ఆరున్నర కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.143 కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. మొత్తంగా రహదారులు మరియు ఇతర మౌలిక వసతుల పునరుద్ధరణకు రూ.150 కోట్ల వరకు అవసరమవుతుందని అధికారుల నివేదిక వెల్లడించింది.అలాగే వర్షాలు, వరదల కారణంగా 66 రహదారులు, 83 క్రాస్ డ్రైన్ పనులు, 60 చోట్ల గండ్లు పడినట్లు వివరించారు. అంతేకాకుండా శిథిలావస్థలో ఉన్న 36 భవనాలు గుర్తించామని, వాటిలో నివసిస్తున్న ప్రజలను ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నామని మంత్రికి తెలియజేశారు.గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా రవాణా సంబంధాలు తెగిపోయిన కొన్ని గ్రామాలకు మళ్లీ కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు, అశోక్ తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమిలి మండలంలోని కర్జిభీంపూర్ గ్రామానికి, అదే మండలంలోని రాజారం గ్రామానికి రవాణా సంబంధాలను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. అసిఫాబాద్ జిల్లా, అసిఫాబాద్ మండలంలోని రాజూర్ గ్రామానికి కూడా కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్నవారు పనిప్రదేశాలను వదిలి వెళ్లరాదని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతు పనులను తక్షణం పూర్తి చేయాలని ఆదేశిస్తూ, కలెక్టర్ల వద్ద ఇప్పటికే నిధులు అందుబాటులో ఉన్నందున వాటిని వినియోగించి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.



# పేకాట ఆడుతూ దొరికిన ప్రముఖులు

## భారీగా నగదు స్వాధీనం.. 11 మంది అరెస్ట్

## పట్టుబడిన వారిలో ఓ ఎమ్మెల్సీ తండ్రి, కార్పొరేటర్

**హైదరాబాద్, ఆగస్టు 18(జర్నలిస్ట్‌ఫైల్):** పేకాట ఆడుతూ పలువురు ప్రముఖులు పోలీసులకు చిక్కారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైష్ణవికాలనీలో ఓ గెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్వోటీ పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేసి, 11 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.52 లక్షల నగదుతో పాటు 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పట్టుబడిన వారిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు(72), అల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్(64), కూకట్‌పల్లికి చెందిన ప్రముఖులు, వ్యాపార వేత్తలు నాయినేని తులసిరావు(58), గన్నమనేని బాలరావు(61), వడ్డేల భాస్కర్(60), కల్వకుంట్ల రంగారావు(57), అవధూత నాగేశ్వరరావు(61), మురళి మోహన్ కృష్ణ కుమార్(79), చింతపట్ల అనిల్‌కుమార్(55), తీగల శ్రీనివాస్ రావు (55), సిహెచ్.భాస్కరరావు(62)లు ఉన్నారని పోలీసులు తెలిపారు.

# కట్టిన ఇల్లులా.. పెట్టిన పొయ్యిలా కాళేశ్వరం!

## కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యం: మాజీమంత్రి హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, (జర్నలిస్ట్‌ఫైల్‌ప్రతినిధి):** కట్టిన ఇల్లులా పెట్టిన పొయ్యిలా కాళేశ్వరం ఉంటే ఈ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదిలి పడావు పెట్టిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయాల కోసం రైతులపై పగ,ప్రతీకారం తీర్చుకుంటుందన్నారు. ఎదైన ఉంటే మాపై కక్షసాధింపు చేయాలి తప్పా రైతులపై కాదని తెలిపారు.

అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయాలి తప్ప కీడు చేయకూడదన్నారు.నంది మేడారంలో కటక ఒత్తితే రోజుకు రెండు టీఎంసీల నీళ్ల వచ్చి మిడ్ మానేరు లో పడతాయాన్నారు. వారం రోజుల క్రితమే ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఉత్తరం రాశానన్నారు. అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి. నీళ్లను ఒడిసి పట్టండి వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నవం చేశాము అయిన ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారన్నారు.నీళ్ళ విలువ రైతులకు తెలుస్తది కాని ఉత్తంకుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డికి ఏం తెలుసన్నారు.కేసిఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నా, ముఖ్యమ ంత్రిగా ఉన్నా వ్యవసాయం చేసే ఒక రైతు ఆయన రైతు గనుకే ప్రతి చుక్కను ఒడిచి పట్టి నీళ్లను రైతులకు అందించారు.

కాంగ్రెస్ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. కాళేశ్వరం కూలిందని చేసిన దుష్ప్రచారాన్ని కప్పిపుచ్చు కోవడానికే మోటర్ల ఆన్ చేయడం లేదు. వరద కాలువ ఒపెన్ చేసి మిడ్ మానేరు ఎల్ఎండి ఎందుకు నింపడం లేదో తెలపాలన్నారు. రిజర్వాయర్లన్ని నింపితే యాసంగిలో లక్షల ఎకరాల్లో పంట పండుతుందన్నారు. ఎరువులు, పంట భీమా,కరెంటు ఇవ్వడానికి ఆఖరికి నీళ్లను ఇచ్చేందుకు కూడా ఈ ప్రభుత్వం రైతులను గోసపెట్టుకుంటుదన్నారు. పదేళ్ళలో ఎన్నడు రైతులు ఎరువు బస్తాల కోసం అరుగుల మీద పడుకోలేదని,కాంగ్రెస్ వచ్చింది మార్పు వచ్చింది మళ్ళీ పాత రోజులు వచ్చాయాన్నారు.

చెప్పులను లైన్లో పెట్టి అరుగుల మీద పడుకునే రోజులొచ్చాయన్నారు.నేను రాజకీయాల కోసం మాట్లాడటం లేదు రైతుల కోసం మాట్లాడుతున్నా రైతుల పక్షాన మాట్లాడుతన్నా మాజీ నీటి పారుదలశాఖ మంత్రిగా అవగాహనతో మాట్లాడుతున్నానని ధ్వజమెత్తారు. ఇప్పటికెనా కాళేశ్వరం మోటర్లను ఆన్ చేయడం చేతకాకపోతే మేమే వేలాది మంది రైతులతో కదిలి వెళ్లి మోటార్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు.

# ఆర్ఎస్ఎస్‌పై రాహుల్‌గాంధీ విమర్శలు తగదు

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 18(జర్నలిస్ట్‌ఫైల్):** ఆర్ఎస్ఎస్‌పై రాహుల్‌గాంధీ విమర్శలు చేయడం తగదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ పతాక ఆవిష్కరణ తర్వాత జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ ప్రసంగంలో ఆర్ఎస్ఎస్ సేవలను కొనియాడుతూ ప్రస్తావించారు. దీనిపై రాహుల్ గాంధీ రకరకాల విమర్శలు గుప్పించారని, రకరకాల మాటలు కూడా మాట్లాడారన్నారు. రాహుల్‌గాంధీ చరిత్ర తెలిసి మాట్లాడాడా? లేక చరిత్ర తెలియక మాట్లాడాడా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో తాను కొత్త పంథాను చూపించుకోవడం కోసం మాట్లాడాడా? అన్నది అర్థం కావడం లేదన్నారు. స్వయంగా ఆయన తాత జవహర్ లాల్ నెహ్రూ, చైనా యుద్ధ సమయంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు చేసిన సేవలను గమనించి, జవాన్లకు అందించిన సహకారాన్ని గుర్తించారన్నారు. ఆ తీరును దృష్టిలో పెట్టుకొని, 1963 జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు స్వయంగా భారత ప్రధాని నెహ్రూ ఆర్ఎస్ఎస్‌ను పాల్గొనాలని కోరుతూ ఆహ్వానించారన్నారు. ఈ విషయం రాహుల్ గాంధీకి తెలియనట్టుందని, దీనికి సంబంధించి దృశ్యాలు చూడవచ్చునని అన్నారు. చైనా భారత్‌పై ఆక్రమణ చేస్తుందని పలు సార్లు హెచ్చరికలు వచ్చాయి. కానీ ప్రభుత్వం, ప్రసార మాధ్యమాలు దానిని సీరియస్‌గా తీసుకోలేదు. చివరికి 1962లో చైనా భారత్‌పై ఆక్రమణ చేసింది. అలాగే భారత్-పాకిస్తాన్ యుద్ధాలలో కూడా స్వయంసేవకులు ప్రభుత్వం, సైన్యానికి అన్ని విధాలా సహకారం అందించారు. కొన్ని సంవత్సరాల తర్వాత గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడానికి పండిట్ నెహ్రూ స్వయంగా సంఘాన్ని ఆహ్వానించారు. సంఘంలోని వారు కూడా దేశభక్తులే అని నెహ్రూ అన్నారన్నారు.

# పేట్‌బషీరాబాద్ సరోగసి కేసు సంచలనం

## ఏజెంట్లుగా నిందితులు .. పలు ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), ఆగస్టు 18(జర్నలిస్ట్‌ఫైల్):** రెండు తెలుగు రాష్ట్రాల్లో సరోగసి కేసులు వేల సంఖ్యలో వెలుగులోకి వస్తుండటం, అటూ అధికారులను, ప్రజలను ఆశ్యర్యానికి గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో పోలీసులు వారి కర్తవ్యాన్ని నిర్వహిస్తూ.. ముందుకు దూసుకెళ్తున్నారు. తాజాగా మేడ్చల్ సరోగసి కేసును సుమోటో కేసుగా తీసుకుని పేట్ బషీరాబాద్ పోలీసులు ఎస్ఐఆర్ నమోదు చేశారు. పేట్ బషీరాబాద్ పరిధిలో వెలుగులోకి వచ్చిన సరోగసి రాకెట్ కేసు దర్యాప్తు వేగం అందుకుంది. ఈ కేసులో నిందితురాలు లక్ష్మి ్మ, ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి పలు ప్రైవేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా వ్యవహారించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పేట్ బషీరాబాద్ పోలీసులు పలు ప్రముఖ ఆస్పత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు హెగ్డే హాస్పిటల్, లక్స్ హాస్పిటల్, అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, ఈవీఎఫ్ ఐవిఎఫ్ సెంటర్, ఫర్టి కేర్, శ్రీ ఫెర్టిలిటీ, అమూల్య ఫెర్టిలిటీ సెంటర్‌లకు శనివారం నోటీసులు అందజేశారు.

ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సరోగసి ముఠా ఈ ఆస్పత్రుల ద్వారా దందా కొనసాగించిన అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై స్పష్టత కోసం ఆయా ఆస్పత్రుల యాజమాన్యానికి నోటీసులు పంపినట్లు సమాచారం.

**ఇంకా వెలుగులోకి రాబోయే అంశాలు..**

దర్యాప్తు కొనసాగుతున్న దశలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కొందరి ఆర్థిక అవసరాలు, ఇబ్బందులను, మరొకరి సంతాన సాఫల్యత కలను క్యాష్ చేసుకుంటున్నాయి. ఒకరు భర్తప్రాణాలను రక్షి ంచుకు నేందుకు సరోగసికి ఒప్పుకుంటే.. మరొక యువతి కుటుంబ అవసరాల కోసం అండం డొనేట్ చేసేందుకు ఒప్పుకుంది. ఇలాంటి అనేక విషయాలు సరోగసి అక్రమ దందా కేసులో వెలుగులోకి వస్తున్నాయి.

**కిడ్నీ ఆపరేషన్ కోసం..**

సరోగసి అక్రమ దందా కేసులో గర్భవతిగా ఉన్న ఓ మహిళ తన భర్త ప్రాణాలు కాపాడుకునేందుకు సరోగసికి ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన ఈమెకు ఇప్పటికే ఇద్దరు పిల్లలున్నారు. భర్తకు రెండు కిడ్నీలు పాడవడంతో ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఎవరూ సహకరించక పోవడంతో ఆమె సరోగసి దందా చేస్తున్న నారెడ్డుల లక్ష్మీరెడ్డిని సంప్రదిం చింది. మహిళ అవసరాన్ని తెలుసుకుని అందుకు సహకరిస్తానని చెప్పి అన్నట్టుగానే భర్తకు ఆపరేషన్ చేయించింది. దీనికి రూ.15 లక్షల వరకు చెల్లించినట్లు తెలుస్తుంది. తర్వాత బాధిత మహిళకు సరోగసి చేయించి ఆమెను పద్మానగర్‌లో ఉన్న తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించింది.

**అండానికి రూ.10 వేలు..**

సరోగసి అక్రమ దందా చేస్తున్న మహిళ ఒక్కో అండ దానానికి రూ.10 వేలు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు.



నెలలో ఓ మహిళ మూడు అండాలను ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి మొత్తంగా రూ.30 వేలు బాధిత మహిళలకు అందిస్తుంది. ఈ క్రమంలోనే ఓ యువతి వద్ద నుంచి అండం సేక రిస్తున్న క్రమంలో విషయం బయటకు వచ్చినట్టు సమాచారం. దీని ఆధారంగానే పోలీసులు ఆకస్మిక తనిఖీలకు వెళ్లి సరోగసి అక్రమ దందా వ్యవహారాన్ని బట్టబయలు చేశారు.

# నకిలీ సరుకుల కేరాఫ్‌గా మారుతున్న న్యూఢిల్లీ

## ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట కల్తీ వస్తువుల తయారీ

## నికోటిన్ సహా ప్రమాదకర రసాయనాలతో ఇ-సిగరెట్ల తయారీ

**హైదరాబాద్, ఆగస్టు 18(జర్నలిస్ట్‌ఫైల్):** దేశ రాజధాని ఢిల్లీ నగరం కల్తీ వస్తువుల తయారీకి కేరాఫ్‌గా మారుతోంది. నిన్నటి వరకు కొన్ని రకాల న కిలీ వస్తువుల తయారీ వరకే పరిమితమైన ఢిల్లీ నగరం నేడు ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట నాసీరకం పొగాకుతో కల్తీ వస్తువుల తయారీతో పాటు నికోటిన్ సహా ప్రమా దకర రసాయనాలతో ఈ..సిగరెట్ల తయారీ కూడా ఎక్కువగా జరుగుతుండడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది. ఢిల్లీ నగరంలో తయారవుతున్న కల్తీ సరుకు హైదరాబాద్ సహా దేశంలోని అన్ని నగరాలకు సరఫరా అవుతుండగా ఆయా నగరాలలోని చోటా వ్యాపారు లు, నేరగాళ్లు వీటికి ఏజెంట్లుగా వ్యవహరిస్తూ మార్కెట్లను శాసించే స్థాయికి చేరుకోవడం విశేషం. ఢిల్లీ సరుకు అంటే ఒకప్పుడు కచ్చితంగా మంచిదనే పేరుండేది. కానీ నేడు అక్కడ నుంచి వచ్చే సరుకంతా నకిలీదిగా వుంటోందని పోలీసులకు అందుతున్న ఫిర్యాదులు చెబుతున్నాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల దుస్తుల ఉత్పత్తులు మొదలుకొని విద్యుత్ ఉపకరణాలు, సిగరెట్లు, గృహోపక రణాలు, ఆహార వస్తువులు ఇలా అనేక రకాల ఉత్పత్తుల నకిలీకి ఢిల్లీ కేంద్రంగా మారడం ఇప్పుడు హాట్ టాఫిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని కోఠి, బేగంబజార్ సహా అనేక ప్రాంతాలలో నగర పోలీసులతో పాటు ఢిల్లీ పోలీసులు బడా కంపెనీల ప్రతినిధులతో కలిసి నకిలీ ఉత్పత్తులను అమ్మేవారి కోసం తరచూ సోదాలు జరుపుతున్నారంటే వీటి చలామణి మార్కెట్లో ఏ స్థా యిలో వుందో ఊహించుకోవచ్చు. ఒక్క హైదరాబాదే కాదు దేశంలోని అన్ని ప్రముఖ నగరాలలోనూ ఇదే తరహాలో నకిలీలు రాజ్యమేలుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఇటీవల కాలంలో నకిలీ ఉత్పత్తుల వెల్లువలో ఎ క్కువగా పట్టుబడుతున్నవి నకిలీ విద్యుత్ ఉపకరణాలు, దుస్తులు, నూనెలు, సబ్బులు, ఆహార వస్తువులతో పాటు ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట న కిలీ, నాసీరకం సిగరెట్లు, నికోటిన్ సహా ప్రమాదకర రసాయనాలతో తయారవుతున్న ఈ..సిగరెట్లు వుంటున్నాయి. ఇతర వస్తువుల విషయం ఎలా వున్నా ఆహార వస్తువులతో పాటు నకిలీ సిగరెట్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. వీటిని చలామణి చేస్తున్న నేరగాళ్లు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. ముఖ్యంగా గడచిన రెండేళ్ల కాలంలో నకిలీ విదేశీ సిగరెట్లు, నకిలీ ఈ..సిగరెట్ల వరుసగా పట్టుబడుతుండడం గమనార్హం. భారత్‌లో సిగరెట్ ప్రియులకు కొదవలేదన్న సంగతి బహిరంగ రహస్యమే. ఇందులో విదేశీ సిగరెట్లు అంటే మోజుపడే వారు మరింత మంది వుండేది విదితమే. సరిగ్గా ఈ అంశాన్ని సొమ్ము చేసుకుంటున్న స్మగ్లర్లు బీడీల తయారీలో వాడే నాసికరం పొగా కును వాడుతూ అందులో కొంత రంగు, వాసన కలిపి విదేశీ సిగరెట్ల మా దిరిగా చక్కగా ప్యాకింగ్ చేస్తూ వాటిని అనేక నగరాలలోని ఇష్టారాజ్యంగా పంపిణీ చేస్తున్నారు. పట్టుమని అర్థ రూపాయి కూడా ఖరీదు చేయని నకిలీ సిగరెట్లు డీలర్లకు రెండు రూపాయల నుంచి మూడు రూపాయలకు ఇస్తున్నారు. వీటిని కొంటున్న వ్యాపారులు 25 రూపాయల నుంచి 40 రూపాయల వరకు అమ్ముతూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. విదేశీ సి గరెట్ల పేరిట దమ్ము పీలుస్తూ రింగు రింగులుగా పొగ వదులుతున్న పొగరాయుళ్లు తాము తాగేది నకిలీ సిగరెట్ అనేది తెలియక తమ ఆరోగ్యాన్ని తామే పాడు చేసుకుంటున్నారు. సాధారణంగా విదేశీ సిగరెట్లు అంటే ఫారిన్, బ్రిటీష్, జర్మనీ దేశాల సరుకుకు బాగా డిమాండ్ వుంటుంది. ఇదే క్ర మంలో న కిలీ సరుకును తయారుచేస్తున్న స్మగ్లర్లు సిగరెట్ ప్రియుళ్ల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు.

**కల్తీ ఆహార వస్తువులు, నకిలీ సిగరెట్లతో ప్రమాదంలో ప్రజల ఆరోగ్యం: వైద్య నిపుణులు**

ఇదిలా వుండగా కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ సిగరెట్లతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆహార వస్తు వుల తయారీ, విక్రయాల విషయంలో సర్కారీ విభాగాలు కఠినంగా వుండాలని వారంటున్నారు. ఇదే సమయంలో నకిలీ సిగరెట్ల క్రయవిక్రయాల లోనూ ఇదేరీతిన వుండాలని వారు చెబుతున్నారు. సిగరెట్ పీల్చడమే ప్రమాదకరం అయినపుడు నకిలీ సిగరెట్ మరింత ప్రమాదకరమని క్యాన్సర్ ఆసత్రి వైద్యులు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా అన్ని నగరాలలో నకిలీ సిగరెట్ల అమ్మకాలపై తమకు సమాచారం వుందని, ఈ విషయంలో ఆయా ప్రాంతాల పోలీసులతోపాటు పౌర విభాగాల అధికారులు కఠినంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు. కల్తీ సిగరెట్ల వాడకం వల్ల నోటి క్యాన స్ర్, గుండె క్యాన్సర్, రక్త క్యాన్స ర్‌వంటి ప్రమాదకర జబ్బులు వచ్చే అవకాశాలున్నాయని వారంటున్నారు. సిగరెట్లు వాడు తున్న వారు క్యాన్సర్ బారినపడుతూ నిత్యం తమ వద్దకు వస్తున్నారని, ఇందులో నకిలీ సిగరెట్ల బారిన పడ్డ వారు కూడా వున్నారని వైద్య నిపుణులు తెలిపారు.

## అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా అలపర్తి విద్యాసాగర్ ఎన్నిక





**ఢిల్లీ, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీలో జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎన్ జీజీఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ని జాతీయ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆగస్టు 16 17 18 తారీకులలో న్యూఢిల్లీ ఫరీదాబాద్ లో జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో 29 రాష్ట్రాల నుంచి రాష్ట్ర సంఘ నాయకులు పాల్గొన్నారు. ఏఐఎస్ జీఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుకు మార్ ఎన్నికను ప్రతిపాదిస్తూ అలపర్తి విద్యాసాగర్ పేరును జాతీయ ఉపాధ్యక్షుడిగా సూచించారు. జాతీయ కార్యవర్గ సభ్యులందరూ మరియు రాష్ట్రాల ప్రతినిధులు ఎన్నికను ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. తదుపరి ఎన్నికను ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆలపర్తి విద్యా సాగర్ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ తన బాధ్యతలో మరింత పెరిగాయని, జాతీయ స్థాయిలో జరిగే ఉద్యమాల కార్యాచరణ బాధ్యత కూడా తన మీద ఉంటుందని, ముఖ్యంగా జాతీయస్థాయిలో జరిగే సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, లేబర్ కోడ్ వంటి అంశాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని, ఎన్నికలు నడిపించిన చైర్మన్ సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి సుకుమార్ కు జాతీయ కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన విద్యాసాగర్ ను ఎన్ జీజీఓ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ, ఆల్ ఇండియా వుమెన్ సబ్ కమిటీ కన్వీనర్ రాజ్యలక్ష్మి, ఎన్ జీజీఓ నాయకులు రవిశంకర్, కిషోర్ మరియు మాజీ నాయకులు మహమ్మద్ ఇక్బాల్ అభినందనలు తెలిపి సత్కరించారు.

## వాటర్ డిస్పెన్సర్ బహుకరించిన కమ్మిలి దంపతులు



**ఆగిరిపల్లి, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామంలో యుపి స్కూల్ సహాయార్థం వాటర్ డిస్పెన్సర్, మరియు విద్యార్థులకు పుస్తకాలు పరీక్ష ప్యాడ్లు, పెన్సిల్ బాక్సులు, మరియు మెటీరియల్, బహుకరించిన కమ్మిలి వెంకటేశ్వరరావు వారి అర్ధాంగి అయిన అడ్వకేట్ సాహితీలు, ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ ప్రెసిడెంట్ మాదాల ప్రసాదు విచ్చేసి కమ్మిలి వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించితిరి, ఈ కార్యక్రమంలో మసిముక్కు గంగరాజు, వీరభత్తిన జోషి బాబు, తదితరులు పాల్గొన్నారు

## శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

### చైర్మన్ గా భీమవరపు శంకర్ రెడ్డి నియామకం



**విజయవాడ రూరల్, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** నున్నలోని కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్స వం ఆదివారం జరిగింది. దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్ హేమలత దేవి నూతన ధర్మకర్తల మండలితో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీ కాశీ విశేశ్వరస్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ గా భీమవరపు శంకర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. అలాగే మండలి సభ్యులుగా డాక్టర్ మున్నంగి శ్రీహరి, తల్లిబోయిన దుర్గా రావమ్మ, దర్శి సుజాత లక్ష్మి, యనగంటి సాంబశివరావు, అంగజాల శివయ్య, డాక్టర్ నల్లూరి ప్రసాదరావు, బేతపూడి చిన్ని, వడ్లపూడి పుణ్యవతి నియమితులయ్యారు. కాగా మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ కమిటీ కృషి చేస్తుందన్నారు.

# పీ4 నుంచి మరో విజయ ప్రస్థానం

- 5,465 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా కృష్ణా మిల్క్ యూనియన్
- గ్రామీణ నిరుపేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కొత్త ప్రయాణం
- ఈ మార్గదర్శనం ఎందరికో స్ఫూర్తిదాయకం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** పేదరికం లేని సమాజమే ధ్యేయంగా గౌరవ ముఖ్య మంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వినూత్న పీ4 విధానంలో మరో మైలురాయి. పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తూ.. పాడి రైతుల సంక్షేమంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ పీ4లో మేము సైతం అంటూ 5,465 గ్రామీణ బంగారు కుటుంబాలకు మార్గద ర్శనం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చింది. ఈ మేరకు కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు తాజాగా నందిగామ మండలం, మునగచర్లలో జరిగిన సామూహిక గోకులం కార్యక్రమం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశకు ప్రమాణ పత్రాలు అందజేశారు. వత్సవాయి మండలం నుంచి 1,524 బంగారు కుటుంబాలు, పెనుగంచిప్రోలు మండలం నుంచి 1,192, విస్సన్నపేట మండలం నుంచి 1,255, విజయవాడ గ్రామీణ మండలం నుంచి 747, చందర్లపాడు నుంచి 747 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ఆంజనేయులు ప్రకటించారు. బంగారు కుటుంబాల ఆర్థికస్థితిగ తులను అధ్యయనం చేసి.. వారి జీవితాలను సాధికారత దిశగా నడిపించేందుకు అవసరమైన చేయూత అందించనున్నట్లు పేర్కొన్నారు. పాడి పశు వుల కొనుగోలుకు కేడీసీసీ ద్వారా ఇచ్చే రూ. లక్ష చొప్పున రుణాలకు సంబంధించి వడ్డీని యూనియన్ భరిస్తుందన్నారు. పశు గ్రాసంతో పాటు పశు వైద్యసేవలు వంటి విషయాలపై యూనియన్ ప్రత్యేకం గా దృష్టిసారిస్తుందని.. అవసరం మేరకు సామూహిక గోకులాలు ఏర్పాటుచేసి వాటిని సద్వినియోగం చేసుకునేలా చేయిపట్టి నడిపిస్తామన్నారు. మహిళా పాడి రైతులను కూడా పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని.. పాడితో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి అడుగులు వేస్తామ న్నారు. బంగారు కుటుంబాలకు చెందిన సభ్యులకు అవసరం మేరకు ఆరోగ్య సేవలు కూడా అందిస్తామని వివరించారు. మేలు జాతి పశు సంతతి, పాల ఉత్పత్తి వృద్ధికి వీలుగా పెయ్యి దూడలు పుట్టేలా లక్ష డోసుల లింగ నిర్ధారిత వీర్యాన్ని అందించేందుకు రూ. కోటి సహాయాన్ని కూడా కృష్ణా మిల్క్ యూనియన్ ప్రకటించింది. రూ. 150 విలువైన ఒక్కో డోసుకు రూ. 100 రాయితీ ఇవ్వనున్నట్లు వివరించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చే సత్తా పాడి పరిశ్రమకు ఉందని.. ఈ నేపథ్యంలో పాడితో పేదరికాన్ని తరిమికొట్టాలనే సంకల్పంతో వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిన కృష్ణా మిల్క్ యూనియన్‌కు ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని యూనియన్లు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, వ్యక్తులు.. ఇలా మనసున్న ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.



## వావిలాల పిఏసిఎస్ చైర్మన్ గా పట్టాభి రామయ్య

**తిరువూరు, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** వావిలాల పి ఎస్ సి ఎస్ చైర్మన్ గా చేకూరి పట్టాభిరామయ్య, త్రిసభ్య కమిటీ సభ్యులుగా బి.మాధవి, భారతీయ జనతా పార్టీ తిరువూరు రూరల్ మండల మాజీ అధ్యక్షులు బండి అచ్యుతరావుల ప్రమాణ స్వీకార మహోత్సవం వావిలాల పిఏసిఎస్ ((సొసైటీ) నందు తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలు పోలే శాంతి, తిరువూరు ఏఎంసీ డైరెక్టర్ అబ్బినేని చంద్రశేఖర్, ఎస్సీ మోర్చా స్టేట్ జోనల్ ఇన్చార్జి తేనేటి ఇమ్మానియేల్, హైందవ శక్తి ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొత్తూరి ప్రసన్న, కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల వెంకట శ్రీనివాసరావు, ఓబీసీ జిల్లా కార్యదర్శి పిల్లి యలమందరావు, ఏ కొండూరు మండల అధ్యక్షులు గుడిపూడి నాగమల్లేశ్వరరావు, ఏ కొండూరు మండల నాయకులు నాగ సురేంద్రనాథ్, ఎస్వి నరసింహారావు, ఎస్టీ మోర్చా నాయకులు బాణావతు గాంధీ, గంపలగూడెం మండల కన్వీనర్ సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




## ఇద్దరు విలేకరుల పై కేసు నమోదు

**మైలవరం, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ దినపత్రికలలో విలేకరులుగా చలామని అవుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు విలేఖరులపై కేసు నమోదు చేసినట్లు మైలవరం ఎస్ఐ కే సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మైలవరం మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన వీరిశెట్టి నాగ రుక్మిణి భర్త నాగ వెంకట కోటేశ్వరరావు వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఫిర్యాదు దారి రుక్మిణి కూలి పనులు చేసుకుంటూ ఇంటి సమీపంలోని వారి వద్ద నుండి పిడిఎస్ రైసును కొనుగోలు చేసి కోళ్ల ఫామ్ లకు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 12వ తేదీ ఉదయం 8 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు విలేకరులము అంటూ వారి ఇంటి వద్దకు వచ్చి పిడిఎస్ రైస్ ను ఎందుకు విక్రయిస్తున్నారు అంటూ బెదిరించి వారి వద్ద నుండి 20వేల రూపాయలు ఇవ్వాలని లేదంటే పోలీసులకు పట్టిస్తామంటూ బెదిరించడంతో వారు భయపడి 8 వేల రూపాయలను ఫోన్ పే ద్వారా మరొక 12 వేల రూపాయలను వారి చేతికి ఇచ్చినట్లు తెలిపారు. బాధితురాలు వీరిశెట్టి నాగ రుక్మిణి ఫిర్యాదు మేరకు ఎఫ్ ఐ ఆర్ 222/2025 సెక్షన్ 308(2) బి ఎన్ ఎస్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

# ఎరువుల లెక్క పక్కాగా ఉండాలి

- పక్కదారి పడితే క్రిమినల్ కేసులు
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు
- అవకతవకలకు తావులేకుండా ఆకస్మిక తనిఖీలను విస్తృతం చెయ్యండి
- దుకాణాలు, సొసైటీల వద్ద కంట్రోల్ రూమ్ నంబర్ ప్రదర్శించండి
- నానో ఎరువుల వినియోగంతో డబ్బు ఆదాతో పాటు అదనపు ప్రయోజనాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య మిస్తోందని.. ఒక్క కిలో కూడా ఎరువులు పక్కదారి పట్టకూడదని.. ఎవరైనా డైవర్షన్ కి పాల్పడితే క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ.. వ్యవసాయ, సహకార, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొరత అనే మాటకు ఆస్కారం లేకుండా సమృద్ధిగా ఎరువులు ఉన్నాయని.. పక్కదారి పట్టకుండా, ప్రతి రైతుకూ న్యాయబద్ధంగా ఎరువులు పొందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువుల సరఫరాకు సంబంధించి ప్రతి లెక్కా పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఫిజికల్, ఆన్‌లైన్ రికార్డులతో పాటు లావాదేవీలు పారదర్శకంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 6,388 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు డీఏపీ, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ కాంప్లెక్స్.. ఇలా మొత్తం 23,820 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకే ఎరువులను సరైన విధంగా వినియోగించాలని, అవసరానికి మించి తీసుకోకుండా అవగాహన కల్పించాలని సూచించారు. నానో ఎరువుల వినియోగంతో బహుళ ప్రయోజనాలున్నాయని.. నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిని ఉపయో గించ డం వల్ల పంట నాణ్యత, ఉత్పత్తి పెరగడంతో పాటు నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు వీలుం టుందన్నారు. సంప్రదాయ ఎరువుల కంటే తక్కువ ధరలోనే ఇవి లభ్యమవు తాయని, చాలా తేలిగ్గా స్ప్రే చేయొచ్చని వివరించారు. ఎరువులు సరఫరాపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని, ఈ నంబర్ ను ఎరువులు దుకాణాలు, సొసైటీల వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఎరువులను అధిక ధరలకు అమ్మడం, ఇతర ప్రయోజనాలకు మళ్ళించడం వంటి వాటివి తారసపడితే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

**వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలి**

వచ్చే మూడు రోజుల పాటు భారీ వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నదికి వెళ్లే మార్గాలు, వాగులు వంకల వద్ద బాగా కనిపించేలా హెచ్చరిక బోర్డులు ప్రదర్శించాలని ఆదేశించారు. నిరంతరం అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# ఓట్ల చోరీకి మరోసారి బిజెపి కుట్ర

**బీహార్ ఓట్ అధికార యాత్రలో రాహుల్ గాంధీ**



**పాట్నా, ఆగస్ట్ 18:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం కొత్త కుట్ర జరుగుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బీహార్‌లోని సాసారాం లో ఓట్‌అధికార్ యాత్రను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘంపై ఆయన తీవ్ర ఆరోపణలు సంధించారు. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ద్వారా ఓట్లను తొలగించడం, జోడించడం ద్వారా ఎన్నికల్లో ఓట్లను దొంగిలించడానికి కొత్త కుట్ర జరుగుతోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకే తాను ఈ యాత్ర చేపట్టినట్లు ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఇలాగే ఓట్లు చోరీకి గురయ్యాయని ఆందోళన చెందారు. బీహార్‌లో ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల దొంగిలించేం దుకు కుట్ర జరుగుతుందని మండిపడ్డారు. దీని ద్వారా దేశ ప్రజలకు ఎన్నికల సంఘం ఎలా ఓట్లను చోరీ చేస్తుందో అర్థమవుతుందని చెప్పారు. అయితే ఓటుచోరీపై తాను ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన తర్వాత అఫిడవిట్ సమర్పించాలని తనను ఎన్నికల సంఘం కోరిందన్నారు. కానీ బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై మాత్రం ఎన్నికల సంఘం స్పందించ లేదన్నారు. బీహార్‌లో ఓట్ల చోరీని తాము అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. పేదవారికి ఓటు ఒకటే అధికారమని తెలిపారు. వారి ఓటును లాక్కొనే అధికారం ఎవరికి లేదన్నారు. ఇక ప్రతి ఎన్నికల్లో బిజెపినే ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. మహారాష్ట్రతోపాటు పలు ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని పలు ఒపినియన్ పోల్స్ స్పష్టం చేశాయని గుర్తు చేశారు. 2024, సార్వత్రిక ఎన్నికల్లోనే కాదు.. అంతకు ముందు జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇండియా కూటమిదే అధికారమని తేల్చి చెప్పాయని పేర్కొన్నారు. కానీ ఆ ఎన్నికలన్నింటిలో బిజెపి భాగస్వామ్య పక్షాలే గెలిచాయని వివరించారు. దాదాపు కోటి ఓట్లను కొత్తగా ఓటర్ల జాబితాలో చేర్చడం ద్వారా ఈ గెలుపు సాధ్యమైందని ఎంపీ రాహుల్ గాంధీ వివరించారు. అయితే బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఆందోళన చేస్తాయని తెలిపారు. మరికొన్ని నెలల్లో జరగనున్న బిహార్ అసెంబ్లీఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. వాటి లక్ష్యంగా ఓటు హక్కు తొలగించేందుకు ఎన్నికల సంఘం తన వంతు ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ అధికార్ యాత్ర ప్రారంభ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్‌తోపాటు ఇండియా కూటమికి చెందిన నేతలు పలువురు పాల్గొన్నారు. ఆగస్ట్ 17వ తేదీన సాసారాంలో ప్రారంభమైన ఈ యాత్ర సెప్టెంబర్ 1వ తేదీతో పట్నాలో ముగియనుంది.





## భారత్ గడ్డపైకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

### ఢిల్లీ సీఎం, కేంద్ర మంత్రులు ఘనస్వాగతం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా భారత్‌కు చేరుకున్నారు. అంతరిక్ష యాత్ర విజయవంతమయ్యాక అమెరికాలో ఉన్న ఆయన, ఆదివారం తెల్లవారుజామున స్వదేశానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు భార్య కామ్నా శుక్లా, కుమారుడు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా శుభాంశుకు ఘన స్వాగతం పలికారు. శుక్లాశుభాంశు స్వదేశానికి చేరుకోవడం భారత్‌కు గర్వకారణమైన క్షణంగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు. భారతదేశానికి గర్వకారణమైన క్షణం అని ఇస్రోకు కీర్తినిచ్చే క్షణం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇందుకు దోహదపడిన వ్యవస్థకు కృతజ్ఞత తెలుపుతూ, దేశ అంతరిక్ష పరిశోధనలు భారత్‌సైతం చేయగలిగిందన్నారు. భారతమాత దిగ్గజ పుత్రుడు శుభాంశు శుక్లా ఈరోజు తెల్లవారు జామున ఢిల్లీలో అడుగుపెట్టారు. ఆయనతో పాటు మిషన్ గగన్‌యాన్‌కు ఎంపికైన వ్యోమగాముల్లో ఒకరైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారని మంత్రి తెలిపారు. యాక్సియం4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా శనివారం పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని అన్నారు. అయితే భారత్‌కు వచ్చిన శుక్లా, సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈనెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొంటారని వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన యాక్సియం4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మానవాళికి ప్రయోజనం కలిగించే పలు ప్రయోగాలను నిర్వహించిన శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. ఆ వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కి (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

## కతువా జిల్లాలో భారీ వరదలకు నలుగురి మృతి

**శ్రీనగర్, ఆగస్టు 18:** జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గత రాత్రి కురిసిన భారీ వర్షాలు నలుగురి ప్రాణాలను బలితీసుకున్నాయి. మరికొందరు గాయపడ్డారు. వరద ప్రవాహం కారణంగా ఒక గ్రామానికి బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లింది. రైల్వే ట్రాక్‌తో పాటు జాతీయ రహదారి కూడా దెబ్బతిన్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌పైనా వరద ప్రభావం పడిందని ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పౌర, సైనిక, పారామిలిటరీ బలగాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో కతువా జిల్లా యంత్రాంగం ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. నదులు, వాగులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించింది. ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉన్నందున అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## హిమాలయ రాష్ట్రాల్లో క్లౌడ్‌బరస్ట్‌లతో అతలాకుతలం



**శ్రీనగర్, ఆగస్టు 18:** జమ్మూకాశ్మీర్‌లో గత కొన్ని రోజుల నుంచి క్లౌడ్ బరస్ట్‌లు వరుస విషాదాలకు దారి తీస్తున్నాయి. గత గురువారం కిస్త్వార్‌లోని చషోటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. దీంతో 60 మంది చనిపోయారు. శనివారం కథువా జిల్లాలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఇలా జమ్మూకాశ్మీర్‌లో విలయం సృష్టిస్తున్న క్లౌడ్ బరస్ట్‌తో అపారనష్టం జరిగింది. అతి తక్కువ సమయంలో,అతి తక్కువ భౌగోళిక ప్రాంతంలో, అతి ఎక్కువ వర్షపాతం పడటాన్ని క్లౌడ్ బరస్ట్అని అంటారు. 20 నుంచి 30 చదరపు కిలోమీటర్ల పరిధిలో గంటలకు 10 సెంటీమీటర్ల వర్షపాతం పడితే దాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ఒక్కోసారి ఉరుములు, పిడుగులతో భారీ స్థాయిలో కురిసే వర్షాల కారణంగా వరదలు సైతం వస్తుంటాయి. స్వల్ప పరిధిలో రెండు గంటల వ్యవధిలో 5 సెంటీమీటర్లు లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం పడితే మినీ క్లౌడ్ బరస్ట్ అంటారు. అయితే, తక్కువ సమయంలో కురిసే అన్ని భారీ వర్షాలను క్లౌడ్ బరస్ట్‌లు అనలేము. కొన్ని వాతావరణ పరిస్థితులు ఉంటేనే క్లౌడ్ బరస్ట్ అంటాము. రుతు పవనాలు దేశంలోకి ప్రవేశిం చినపుడు అరేబియా సముద్రంలోనుంచి తేమతో కూడిన గాలులు వీస్తాయి. ఇవి అధిక తేమ కలిగిన మేఘాలుగా మారతాయి. వాతావరణం లో వేడి వల్ల ఈ మేఘాలు కరుగుతూ ఉం టాయి. అలా కరిగి, కరిగి మేఘాలు బరువెక్కుతాయి. ఏదో ఒక చోట పేలిపోతాయి. అలా తక్కువ ప్రాంతంలో, తక్కువ సమయంలో భారీ వర్షం పడి వినాశనం జరుగుతుంది. 1970లో ఉత్తరాఖండ్‌లోని అలకనందా లోయలో క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ విధ్వంసం జరిగింది. అలకనందా నదికి వరద నీరు పోటెత్తటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. 1993లో ఉత్తరాఖండ్‌లోని పితోరాఘర్ జిల్లా, మల్పా గ్రామంలో క్లౌడ్ బరస్ట్ కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కైలాష్ మానస సరోవర్ యాత్రకు వెళుతున్న భక్తులు చాలా మంది చనిపోయారు. 2003 నుంచి 2004 మధ్య కాలంలో ఉత్తరాఖండ్‌లోని కులు, చమలీ ఏరియాలో మినీ క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. దీంతో కొండ ప్రాంతంలో ఆస్తి నష్టం సంభవించింది. 2010లో లడఖ్‌లోని లేహ్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. దాదాపు 200 మంది చనిపోయారు. వందల మంది గాయపడ్డారు. 2022 జమ్మూకాశ్మీర్‌లో అమర్‌నాథ్ గుహ దగ్గర క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు చనిపోయారు.

## బిగ్‌బాస్ విజేత ఎల్విస్ యాదవ్ ఇంటివద్ద కాల్పులు



**గురుగ్రామ్, ఆగస్టు 18:** ప్రముఖ యూట్యూబర్, బిగ్ బాస్ ఓటీటీ 2 విజేత ఎల్విష్ యాదవ్ నివాసం వద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న ఆయన ఇంటిపై ఈ తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు ఎల్విష్ యాదవ్ ఇంటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. దాదాపు 25 నుంచి 30 రౌండ్ల వరకు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని వారు తెలిపారు. కాల్పులు జరిగిన సమయంలో ఎల్విష్ యాదవ్ (27) పని నిమిత్తం హర్యానా బయట ఉన్నట్లు తెలిసింది. అయితే, ఆయన కుటుంబ సభ్యులు, ఇంటి కేర్‌టేకర్ మాత్రం ఇంట్లోనే ఉన్నారు. ఈ భవనంలోని రెండు, మూడు అంతస్తుల్లో ఎల్విష్ కుటుంబం నివాసం ఉంటోంది. ఘ టన గురించి సమాచారం అందుకున్న వెంటనే గురుగ్రామ్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సెక్టార్56 పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలం నుంచి ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించింది. దుండగులను గుర్తించేందుకు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై ఎల్విష్ యాదవ్ కుటుంబ సభ్యులు ఇంకాఅధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.దుండగులు ఎందుకు కాల్పులకు తెగబడ్డారనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## తెరుచుకున్న శబరిమలై: ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రధానాచార్యులు





**పతనంతిట్ట, ఆగస్టు 18:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్పస్వామి ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. వార్షిక చింగం మాస పూజల కోసం శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయ పూజారులు తలుపులు తెరిచారు. ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి తంత్రి కందరరు మహేష్ మోహనరు సమక్షంలో ఆలయ దీపాలను, ఆళి (పవిత్ర అగ్నిగుండం)ను వెలిగించారు. వేలాది మంది అయ్యప్ప భక్తులు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వేడుకను తిలకించారు. చింగం మాస పూజలను పూర్తి అయ్యే వరకు పడిపూజ కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటలకు జరుగుతుంది. అదే సమయంలో సెప్టెంబర్ 20న పంబా నది ఒడ్డున గ్లోబల్ అయ్యప్ప సమావేశం జరుగుతుందని దేవాదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ ప్రకటించారు. ఇంత పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి కాబట్టి, ఒక చారిత్రాత్మక కార్యక్రమంగా నిలవనుందని తెలిపారు. వివిధ దేశాల నుంచి 3,000 మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నట్లు తెలిపారు. రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్ సిద్ధంచేసామన్నారు. శబరిమల ప్రపంచ ఖ్యాతిని పెంచే లక్ష్యంతో జరిగే ఆ సమావేశంలో కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొంటారు. శబరిమల సంప్రదాయాలను కాపాడుతూ, భక్తుల ప్రయోజనాలను గౌరవిస్తూ, శబరిమలని ప్రపంచ తీర్థయాత్ర కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి వాసవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిందని తెలిపారు. అందులో శబరిమల విమానాశ్రయం, కొత్త రైల్వే లైన్ సహా వివిధ ప్రణాళికలు ఉన్నాయి. విమానాశ్రయం 2028 నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో పథనంతిట్టలో ప్రధాన నిర్వాహక కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. పంబా, పెరునాడ్, సీతాథోడ్‌లలో అదనపు కార్యాలయాలు ఉంటాయి. ప్రతినిధులకు బస్సుల ద్వారా రవాణా, వసతి ఏర్పాట్లు చేయనున్నారు. పంబాతో సహా ఆ ప్రాంతంలోని ఆసుపత్రులలో ఆధునిక వైద్య సౌకర్యాలు కల్పించనున్నారు. వాహనాల పార్కింగ్ కొండపై ఉండనుంది. స్వచ్ఛంద సంస్థలు పారిశుధ్యం, శుభ్రపరిచే విషయంలో సహాయం చేస్తాయి.

## సంక్షిప్తంగా..


### 4 కిలోమీటర్ల టార్గెట్‌ను ఛేదించిన ఉక్రెయిన్ సైనికుడు

**రష్యా సైనికుడిని హతమార్చి రికార్డు**



**హైదరాబాద్, ఆగస్టు 18:** రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు చెందిన ఓ స్నైపర్ అసాధారణ ప్రతిభతో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసు కున్నాడు. ఏకంగా 13,000 అడుగుల (దాదాపు 4 కిలోమీటర్లు) దూరం నుంచి రష్యా సైనికుడిని గురితప్పకుండా కాల్చిచంపి చరిత్ర సృష్టించాడు. ఈ విషయాన్ని కీవ్‌పోస్ట్ పత్రిక అధికారికంగా ప్రకటించింది. పొక్రొవ్స్క్ ప్రాంతంలో ఆగస్టు 14న ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. స్థానికంగా తయారు చేసిన శక్తివంతమైన ఎలిగేటర్ 14.5 ఎంఎం రైఫిల్‌తో ఈ స్నైపర్ ఇద్దరురష్యాసైనికులను మట్టుబెట్టినట్లు సమాచారం. ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేయడానికి ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్ టెక్నాలజీనిఉపయోగించుకున్నట్లు మిలిటరీ జర్నలిస్ట్ యూరి బుట్సోవ్ ధ్రువీకరించారు.

### ఒడిశాలో 20 మెట్రిక్ టన్నుల బంగారం నిక్షేపాలు



**భువనేశ్వర్, ఆగస్టు 18:** ఒడిశాలో భారీ స్థాయిలో బంగారు ఖనిజ నిక్షేపాలు బయటపడినట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ప్రకటించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సుమారు 10 నుంచి 20 మెట్రిక్ టన్నుల నిక్షేపాలను గుర్తించినట్లు తెలిపింది. సుందర్ గఢ్, నవరంగ్ పూర్, కియోంజర్, దేవగఢ్ జిల్లాల్లో ఇప్పటికే బంగారు నిక్షేపాల వెలికితీత పెద్ద ఎత్తున కొనసాగుతోంది. ఈ క్రమంలో మైనింగ్ కార్పొరేషన్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ పరిశోధనలు చేపట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర చుక్కలను అంటుతున్న వేళ ఒడిశాలో బంగారు నిక్షేపాల సంగతి బయటపడడంతో అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పాకిస్థాన్‌లో పట్టాలు తప్పిన ప్యాసింజర్‌రైలు



**కరాచి, ఆగస్టు 18:** పొరుగుదేశంలో ప్యాసింజర్‌రైలు పట్టాలు తప్పింది. ఆదివారం పెషావర్ నుంచి కరాచీకి వచ్చే ప్యాసింజర్‌రైలులోని నాలుగు బోగీలు ఆకస్మికంగా పట్టాలు తప్పాయి. లోధ్రాన్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రయాణీకులతో బయలుదేరిన ప్యాసింజర్‌రైలు ఆకస్మికంగా పట్టాలు తప్పింది. ఈరైలు కరాచీకి చేరుకునేలోపే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్నవెంటనే రైల్వే అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. పట్టాలు తప్పిన బోగీల్లో ఉన్న ప్రయాణీకులను బయటకు తీసారు. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు. లోధ్రాన్ డిప్యూటీ కమయిషనర్ డాక్టర్ లుబ్నా నజీర్‌ప్రకారం మరో ఇద్దరు వ్యక్తులపరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి గల కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. ప్రమాదం తర్వాత ఈమార్గంలో కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిపివేసారు. ట్రాక్ పునరుద్ధరించి తర్వాతనే రైళ్ల రాకపోకలు ప్రారంభం అయ్యాయి.

## ప్రియురాలికోసం కట్టుకున్న భార్యనే కడతేర్చిన బిజెపినేత

**అజ్మీర్, ఆగస్టు 18:** ప్రియురాలితో కలిసి జీవించేందుకు కట్టుకున్న భార్యనే అత్యంత దారుణంగా హత్య చేశాడో భర్త. ఈ ఘోరాన్ని కప్పిపుచ్చేందుకు దోపిడీ నాటకం ఆడినా, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. బిజెపినేత అయిన భర్తే ఈ దారుణానికి పాల్పడటం గమనార్హం. అజ్మీర్‌కు చెందిన బిజెపి నాయకుడు రోహిత్ సైనీకి సంజు అనే మహిళతో వివాహమైంది. అయితే, అదే ప్రాంతానికి చెందిన రీతూ సైనీ అనే మరో మహిళతో రోహిత్‌కు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో తమ బంధానికి భార్య సంజు అడ్డుగా ఉందని భావించారు. ఈ నెల 10న సంజు అనుమానాస్పద స్థితిలో ఇంట్లో మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టగా రోహిత్ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. ఇంట్లోకి చొరబడిన దొంగలు, తన భార్యను హత్య చేసి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. ఈ కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ (రూరల్) దీపక్ కుమార్ మీడియాకు వెల్లడించారు. "ప్రియురాలు రీతూ ప్రోద్బలంతోనే రోహిత్ తన భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. తమ మధ్య నుంచి సంజును తొలగించుకోవాలని రీతూ ఒత్తిడి చేయడంతో ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపాడు.

ఘటన జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించామని ఆయన వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రోహిత్ సైనీతో పాటు, హత్యకు ప్రేరేపించిన అతని ప్రియురాలు రీతూ సైనీని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని మరింత లోతుగా విచారిస్తున్నారు.

## భారతీయ తాలిబన్ 'ఆర్ఎస్ఎస్'

**కాంగ్రెస్ సీనియర్‌నేత బికె హరిప్రసాద్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)ను 'ఇండియన్ తాలిబన్లు'గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆరెస్సెస్‌పై ప్రశంసలు కురిపించిన నేపథ్యంలో హరిప్రసాద్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై అధికార బిజెపి తీవ్రంగా స్పందించింది. జాతీయవాద సంస్థలను అవమానించడం, నిషేధిత సంస్థలను ప్రేమించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఘాటుగా బదులిచ్చింది. కర్ణాటక ఎమ్మెల్సీ అయిన బీకే హరిప్రసాద్ మాట్లాడుతూ "దేశంలో శాంతికి భంగం కలిగించేందుకు వారు (ఆరెస్సెస్) ప్రయత్నిస్తున్నారు. నేను ఆరెస్సెస్‌ను తాలిబన్లతో మాత్రమే పోలుస్తాను. వాళ్లు భారతీయ్కతాలిబన్లు. అలాంటి వారిని ప్రధాన మంత్రి ఎర్రకోటనుంచి ప్రశంసిస్తున్నారని విమర్శించారు.



## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు దక్షిణ కొరియా మద్దతు

### జైశంకర్ ధన్యవాదాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పహల్గామ్ ఉగ్రదాడి, ఉగ్రవాదంపై పోరాటంలో దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యున్ భారత్‌కు సంఘీభావం ప్రకటించారు. భారత ప్రభుత్వం, ప్రజలతో తమ దేశం నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చో హ్యున్ దక్షిణ కొరియా ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విషయంలో తాము చాలా కఠినంగా, దృఢంగా ఉన్నామన్నారు. ఏదైనా ఉగ్రవాద దాడిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. భారత ప్రభుత్వం, భారత ప్రజలతో ఉంటామన్నారు.

## న్యూయార్క్‌లో కాల్పుల కలకలం.. ముగ్గురి మృతి

**వాషింగ్టన్, ఆగస్టు 18:** అమెరికాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. న్యూయార్క్ సిటీలోని రద్దీగా ఉన్న ఓ క్లబ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. న్యూయార్క్ సిటీలో తుపాకీ హింస రికార్డు స్థాయిలో తగ్గిపోయిన వేళ ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో క్లబ్‌లో ఓ వివాదం చెలరేగిన తర్వాత పలు ఆయుధాలతో ఈ కాల్పులు జరిగినట్లు అనుమానిస్తున్నామని న్యూయార్క్ పోలీసు కమిషనర్ జెస్సికా టిష్ వెల్లడించారు.

ఘటనాస్థలం నుంచి 36 షెల్ కేసింగ్‌లను, సమీపంలోని వీధిలో ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతుల వయసు 27 నుంచి 61 యేళ్ల మధ్యలో ఉంటుందని చెప్పారు. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని, వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.



## పదవీ కాంక్షలేదు: ఆసిఫ్ మునీర్

**ఇస్లామాబాద్, ఆగస్టు 18:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ తనను తాను రక్షకుడిగా చెప్పుకునేందుకు తాపత్రయపడుతున్నారు. రాజకీయాలు, అత్యున్నత స్థానాలపై పదవీ కాంక్ష లేదని ప్రకటించడం గమనార్హం. దేశ సేవ కోసమే భగవంతుడు తనను పుట్టించాడని.. ప్రజలను కాపాడటం తప్ప తనకు మరో ఆలోచన ఉండదని అన్నారు. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని బలవంతంగా గద్దెదించి దేశ సైనిక దళాల ప్రధానాధికారి ఆసీం మునీర్ ఆ స్థానాన్ని ఆక్రమించనున్నారంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాజకీయంగా ఉద్రిక్తతలను సృష్టించడానికి కొందరు ఇటువంటి వార్తలను ప్రచారం చేస్తున్నారన్నారు.

## గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన యుఎస్

**వాషింగ్టన్, ఆగస్టు 18:** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాజా ప్రజలపై మరో పిడుగు పడింది. ఇకపై గాజా ప్రజలకు వీసాలు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన అనేకమంది ప్రజలు చికిత్స కోసం యుఎస్‌కు వస్తున్నారని ట్రంప్ యంత్రాంగానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక వైద్య-మానవతా వీసాలను జారీ చేయడానికి ఉపయోగించే ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా గాజా ప్రజలకు అన్నిరకాల వీసాలు నిలిపివేస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది.



## 13 మంది చనిపోయారు: అంగీకరించిన పాకిస్థాన్

**కరాచి, ఆగస్టు 18:** భారత వాయుసేన జరిపిన ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడుల్లో తమకు భారీ నష్టం వాటిల్లిన విషయాన్ని పాకిస్థాన్ ఎట్టకేలకు పరోక్షంగా అంగీకరించింది. ఈ సైనిక చర్యలో 13 మంది సైనిక సిబ్బంది సహా 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్టు ఘటన జరిగిన మూడు నెలల తర్వాత అంగీకరించింది. తమ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మరణించిన సైనికులకు మరణానంతరం శౌర్య పతకాలను ప్రదానంచేసి, ఈ నిజాన్ని ప్రపంచం ముందుఒప్పుకుంది. అధ్యక్ష భవనంలో జరిగిన ఓకార్యక్రమంలో ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో మరణించిన సైనిక సిబ్బందికి మరణానంతరం పురస్కారాలు అందజేశారు. ఈదాడుల్లో భోలారీ ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడిలో మరణించిన స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్‌కు 'తమ్ఘా ఇబసాలత్' పురస్కారాన్ని ప్రకటించారు. ఆయనతో పాటు హవల్దార్ ముహమ్మద్ నవీద్,నాయక్ వకార్ ఖాలిద్, లాన్స్ నాయక్ దిలావర్ ఖాన్‌లకుమరణానంతరం ఈ పురస్కారాన్ని ఇచ్చారు. భారత దాడులు జరిగిన నూర్‌ఖాన్, సర్గోధా, జాకోబాబాద్, భోలారీ,షోర్‌కోట్ వైమానిక స్థావరాల్లో పలువురు గాయపడినట్లు కూడా సమాచారం.

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారి మాను పూజా మహోత్సవం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి నగరంలో మంగళగిరి సగర సంఘం మరియు మహాలక్ష్మమ్మ చెట్టు భక్త బృందం ఆధ్వర్యంలో మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించే శ్రీ మహాలక్ష్మి అమ్మవారి మాను పూజా మహోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది మాను పూజా ఉత్సవంలో భాగంగా ఆదివారం శ్రీ మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి అలంకరణ, దూప దీప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు, 108 కళాశాలతో అమ్మవారికి అభిషేకం, అనంతరం మంగళగిరి రత్నాల చెరువు, రాజీవ్ గృహకల్ప, మార్కండేయ కాలనీ, చినకాకాని, ఎర్రబాలెం, బేతపూడి నుండి 500 మంది మహిళా భక్తులతో పొంగళ్ల బోనాలు, మేళ తాళాలు, కనక తప్పెట్లతో మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నుండి గౌతమ బుద్ధ రోడ్డు ఆంజనేయస్వామి గుడి మీదుగా, సీతారామ కోవెల గాంధీ చౌక్ మీదుగా తిరిగి మహాలక్ష్మమ్మ చెట్టు వద్దకు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాను పూజా ఉత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి సగర సంఘం మరియు మహాలక్ష్మమ్మ చెట్టు భక్త బృందం, సగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి : మాచర్ల బుజ్జి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన నేడు జరగబోయే ఉద్యోగ సంఘాల సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపుదలతో పాటు వారికి సంక్షేమ పథకాలు అమలు చేయడం అంశాలపై చర్చించాలంటూ రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి డిమాండ్ చేశారు.

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకం సహా వివిధ ప్రభుత్వ సంస్థలు, పథకాలలో వేలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, అయితే ఇప్పటివరకు వీరిని రెగ్యులరైజ్ చేయలేదని ఆయన విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో పాటు సంక్షేమ పథకాలను కూడా వీరికి వర్తింపజేయకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి నెలకు కేవలం 13 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ తక్కువ జీతాలతో కుటుంబాల పోషణ అసాధ్యమవుతోంది. ధరలు పెరుగుతున్న ఈ పరిస్థితుల్లో అయినా ప్రభుత్వం కొంత ఉపశమనం కలిగించేలా సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి" అని మాచర్ల బుజ్జి అన్నారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చి, ఇప్పుడు సంక్షేమ పథకాలలో కోతలు విధించడం సమంజసం కాదని ఆయన విమర్శించారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌పై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ త్వరగా రిపోర్టు సమర్పించి "సమాన పనికి సమాన వేతనం" అమలుతో పాటు, సంక్షేమ పథకాలు కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి పత్రిక ప్రకటనలో కోరారు.

## మహాత్మా సేవా శాంతి ఆశ్రమం వృద్ధుల సేవకు లక్ష విరాళం



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** మహాత్మ సేవా శాంతి ఆశ్రమం నిర్వహణలో అన్నదాన సేవలకు, లక్ష రూపాయల విరాళాన్ని అందజేసిన, షేక్ అనీఫ్ తనయులు, షేక్ బాజీ, షేక్ జానీ అభినందనీయులని మహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకులు వజ్రాల రామలింగచారి దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

స్థానిక బుర్రిపాలెం రోడ్ లోని ఏఎస్ఎన్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గల, మహాత్మ సేవా శాంతి ఆశ్రమంలో సోమవారం, ఎన్నో గుప్త దానాలు చేసిన, స్వర్గీయ షేక్ అనీఫ్ పేరిట,వారి కుమారులు, షేక్ బాజీ షేక్ జానీ, వారి వంతుగా ఆశ్రమ నిర్వహణలో అన్నదాన సేవలకు లక్ష రూపాయల చెక్కును ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారికి, ఆశ్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా షేక్ బాజీ మాట్లాడుతూ తమ తండ్రి పేరిట మరెన్నో సేవా కార్యక్రమాలను ఆశ్రమంలో నిర్వహించేందుకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగ చారి దాతల కుటుంబం సేవా దృక్పదాన్ని ప్రశంశిస్తు,ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, రాజు, ఆశ్రమ వృద్ధులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ గురై కౌలు రైతు మృతి



మైదుకూరు జర్నలిస్ట్ ఫైల్ : మైదు కూరు మండ లంలోని పోరుమామిళ్ల రోడ్ లో ఉన్నటువంటి ఎర్ర చెరువు దగ్గర పొలం పనులు నిమిత్తం మోటార్ వేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి రాటాల పవన్ కుమార్ వయసు 38 తండ్రి లక్ష్మీనారాయణ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ గుంటూరు : ఎమ్మెల్యే నసీర్

- నందివెలుగు ఫ్లైఓవర్ నిర్మాణంలో రాజీ లేదు
- 8 నెలల్లో పూర్తి చేసేందుకు తీవ్రంగా కసరత్తు
- వర్షాకాలమైనా పనులు వేగవంతం
- బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరాన్ని అభివృద్ధికి కేరాఫ్ గా తీర్చిదిద్దుతున్నామని, ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులు శరవేగంగా పరుగులు పెడుతున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. పాత గుంటూరులోని నందివెలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఇప్పటి వరకు పనులు ఎంత వరకు పూర్తయ్యాయి ? ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారు ? వర్షాకాలంలో పనులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి ? వంటి అంశాలను కాంట్రాక్టర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నందివెలుగు ఫ్లైఓవర్ నిర్మాణం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టామని తెలిపారు. ఎనిమిది నెలల కాలంలో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పట్టుదలగా ఉన్నామని వెల్లడించారు. బ్రిడ్జి క్వాలిటీ విషయంలో కొంచెం కూడా రాజీ లేదని స్పష్టం చేశారు. బ్రిడ్జి నిర్మాణ సందర్భంగా వాహనదారులు ఈ ప్రాంత ప్రజలు పూర్తిగా సహకారం అందిస్తున్నారని చెప్పారు. అధికారులు బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లు నిర్మించారని, దీంతో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, దీంతో ప్రజలు అవస్థలు పడ్డారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నందివెలుగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.

## నగర సమస్యల పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు : మేయర్, కమిషనర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్‌సిస్టమ్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కూడా పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 16 ఫిర్యాదులను సమీక్షించిన మేయర్, కమిషనర్‌లు – తక్షణం పరిష్కరించదగ్గవి, కొంత సమయం పట్టేవి అని వర్గీకరించి, క్షేత్రస్థాయి పరిశీలనకు విభాగాధిపతులే వెళ్లాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు నివేదిక సమర్పించాలని సూచించారు.

తరువాత పిజిఆర్ఎస్ సమావేశంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, మేయర్, కమిషనర్‌లు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బియండ్ ఎస్ఎల్ఏలోకి అర్జీలు వెళ్లకుండా చూసుకోవాలని హెచ్చరించారు. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యలు స్థానికంగానే పరిష్కరించాలన్నారు. ప్రతి విభాగంలో ప్రత్యేక రిజిస్టర్‌లో ఫిర్యాదుల నమోదుతోపాటు పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలన్నారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు మొత్తం 33 ఫిర్యాదులు అందగా, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 10, ఇంజినీరింగ్ విభాగానికి 14, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 2, ఉపా సెల్ విభాగానికి 3 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. అన్ని ఫిర్యాదులను నిర్దేశిత గడువులో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఇంచార్జి ఎంహెచ్ఓ రామారావు, వివిధ విభాగాల సూపరిండెంట్లు పాల్గొన్నారు.

## ఆధునిక సౌకర్యాలతో సిజిహెచ్‌ఎస్ ను మరింత అభివృద్ధి చేస్తాం

- చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.సిహెచ్.కోటేశ్వరరావు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక వైద్య సదుపాయాలతో సిజిహెచ్ఎస్ ( సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ ) వెల్ నెస్ సెంటర్ ను మరింతగా అభివృద్ధి చేస్తామని సిజిహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సిహెచ్.కోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఉదయం నగరంపాలెం లోని సిజిహెచ్ఎస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన లాబొరేటరీ మరియు ఇంజెక్షన్, బి.పి పరీక్షా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిజిహెచ్ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి. హేమా సుందరి అధ్యక్షత వహించారు. సి.ఎం.ఓ డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ..కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా, సిజిహెచ్ఎస్ ఆరోగ్య కేంద్రాలను, కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరింత మెరుగైన స్థితికి తీసుకువస్తామన్నారు. క్రమంగా పురోగతి సాధించటానికి మరిన్ని నూతన వైద్య పరికరాలు సమకూర్చుకొని, ఉద్యోగులు, పెన్షనర్ల వైద్య సంరక్షణకు మరింతగా కృషి చేస్తామన్నారు.

సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య మాట్లాడుతూ..నూతన ప్రారంభోత్సవాల ద్వారా మరిన్ని వైద్య సౌకర్యాలకు అంకురార్పణ జరిగిందన్నారు. ప్రతి పేషంట్ ఆరోగ్య సంక్షేమమే తమ లక్ష్యమన్నారు.

సిజిహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్యచౌదరి మాట్లాడుతూ..సిజిహెచ్ఎస్ లో ఎప్పుడూ లేని విధంగా మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల లో ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో సిజిహెచ్ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి. హేమా సుందరి, ఫార్మాసిస్టు అయోషా బేగం, సునీల్, లాబొరేటరీ అసిస్టెంట్లు మురళీ, రామారావు, సిబ్బంది మోహన్, మక్బూల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి తో పాటు పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

## ఎపియుడబ్ల్యుజె వార్షికోత్సవం



- అన్నదానసేవ

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే పాత్రికేయ మిత్రులు తమ సమస్త వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని శ్రీ శివలింగేశ్వర భక్తి బృంద సేవ సమితి అధ్యక్షులు కుర్ర శ్రీను పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ 69వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని , స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవ సమితి ప్రాంగణంలో, ఏపీయూడబ్ల్యూజే తెనాలి శాఖ ఆధ్వర్యంలో అన్నదాన సేవలను నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తెనాలి శాఖ కార్యదర్శి గోపిచంద్ మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారంలో ఎన్నో పోరాటాలు చేసిన ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవాన్ని అన్నదాన సేవలతో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. భక్త బృంద సేవ సమితి అధ్యక్షులు కుర్ర శ్రీను మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే పాత్రికేయ మిత్రులు సంస్థ వార్షికోత్సవాన్ని అన్నదాన సేవలతో నిర్వహించడం స్ఫూర్తిదాయక మన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తారక్ సాయినాథ్, ఆర్ వి కిరణ్, శరత్, సాయి, నరసింహ, దుర్గ, అనిల్, కంకిపాటి రమేష్,సత్యదేవ్ స్వామి,జిల్లా కమిటి సభ్యులు బోడపాటి మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వరుని వివాహానికి 'మంగళ సూత్రాన్ని' అందించిన సీఐ విజయలక్ష్మి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ )** మండలంలోని నరసనపల్లె ఎస్సీ కాలనీకి చెందిన సోమిరెడ్డి పల్లె పెద్ద పుల్లయ్య మారతమ్మ కుమారుడు బ్రహ్మయ్య వివాహానికి లెక్కల ఓబులమ్మ సిద్ధారెడ్డి కుమార్తె విజయలక్ష్మి 15 వేల రూపాయలు విలువచేసే బంగారు మంగళ సూత్రాన్ని అందించారు. 'మంగళ సూత్రం'అనేది హిందూ వివాహిత స్త్రీలు, తమ మెడలో ధరించే ఒక ముఖ్యమైన ఆభరణం. ఇది భార్యాభర్తల వివాహబంధానికి సంకేతం. భారతీయ సంప్రదాయంలో, మంగళ సూత్రం అనేది స్త్రీలు ధరించే ఒక ముఖ్యమైన బంగారు ఆభరణం. అయితే బంగారు సామాన్య మధ్య తరగతి పేదలకు అందనంత దూరంలో ఉందని చెప్పాలి. వివాహానికి ఏ వస్తువు లేకపోయినా పరవాలేదు. కానీ ఆ ఒక్కటి లేకపోతే వివాహం అనేది జరగదు ..అదే మంగళసూత్రం . అటువంటి మంగళసూత్రాన్ని పేద కుటుంబంలోని వివాహ శుభకార్యాలకు తమ వంతు సహాయంగా సీఐ విజయలక్ష్మి అందించారు. అయితే ఆమె కర్నూలు జిల్లా లో విధులు నిర్వహించడంతో తమ తల్లిదండ్రులు ఓబులమ్మ సిద్ధారెడ్డి గార్ల చేతుల మీదుగా పెళ్లి కుమారుని తల్లిదండ్రులకు పసుపు కుంకుమ పూలు పళ్ళు చీర జాకెట్టు గాజులు తాళిబొట్టు అందజేశారు.

## ట్రాఫిక్ డైవర్షన్ ప్రాంతాలను ఆకస్మికంగా పరిశీలించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్ చేసిన క్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ట్రాఫిక్ పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి ద్విచక్రవాహనం పై స్వయంగా ప్రయాణిస్తూ పట్టాభిపురము, గుజ్జనగుండ్ల, కోరిటిపాడు, బ్రాడిపేట, శ్యామల నగర్ రైల్వే గేట్, కంకరగుంట ఆర్‌యూబి, జేకేసి కాలేజీ రోడ్డు, ఐటీసీ వంటి ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించారు. ట్రాఫిక్ డైవర్షన్ అమలులో ఉన్న విధానాన్ని గమనించి స్థానికులతో కూడా సమస్యలు తెలుసుకున్నారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పశ్చిమ ట్రాఫిక్ సిఐ సింగయ్యకు సూచించారు. ముఖ్యమైన రోడ్డు జంక్షన్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించడంతో పాటు, వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పనులు పూర్తయిన తర్వాత గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అప్పటివరకు ప్రజలు కొంత సహనం పాటించి, సహకరించాలని కోరుతున్నాను. ప్రజలు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులను నిరంతరం మానిటరింగ్ చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి భరోసా ఇచ్చారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : గుంటూరు ఎస్పీ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సమస్యల పరిష్కారంపై పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అధికారులు స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన లి"ప్రజా ఫిర్యాదుల స్వీకరణ – పరిష్కార వేదిక"లిలో ఉన్నతాధికారులు నేరుగా ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. వాటి స్వభావాన్ని అర్థం చేసుకొని సంబంధిత పోలీసు అధికారులతో వెంటనే సంప్రదించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదు పరిష్కారం పై తీసుకున్న చర్యల వివరాలను నిర్ణీత గడువులోపల జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి (అడ్మిన్), ఏ. హనుమంతు (ఏఆర్), సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్య రంగ సమస్యలను పరిష్కరించాలి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ )** మండలంలో విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మార్వో గారికి వినతిపత్రం అందజేస్తూ, ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంపల్లి అజయ్ మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠంలోని నరసనపల్లి MPP పాఠశాల నందు పోయిన ప్రభుత్వంలో పాఠశాల అభివృద్ధిలో బాగంగా నాడునేడు పనులు ప్రారంచించారు. కొద్దిపాటి పనులు చేసి ప్రహరీ గోడను కట్టని కారణంగా ఆవరణంలోని వర్షపు నీరు చేరి విద్యార్థులకు ఇబ్బంది కలిగించే విధంగా పరిసరాలు ఉన్నాయి. అదేవిధంగా సోమిరెడ్డి పల్లి MPP పాఠశాల పరిస్థితి కూడా అదే విధంగా సగం పనులు జరిగి మధ్యలోనే పనులు ఆగి అలాగే పాఠశాల నడుస్తూ ఉంది. అదేవిధంగా బాయ్స్ హై స్కూల్ నందు ప్లేస్ టూ' గా ఇంటర్ ను చేర్చడం జరిగింది. ఇంటర్ విద్యార్థులు సంవత్సరం కాలం పాటు పాఠశాలలో ఉన్నప్పటికి అవసరమైన క్లాస్ రూమ్స్ అధ్యాపకులు లేని కారణంగా బయటికి వెళ్లడం జరిగింది . కావున పూర్తి కాని ఇంటర్ బిల్డింగ్ ను పూర్తిచేసి తగిన సౌకర్యాలు కల్పించి వచ్చే సంవత్సరం విద్యార్థులు చేరే విధంగా చర్యలు తీసుకోవాలి. అదె విధంగా మన మండలంలో చాలా మంది విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫామ్ పూర్తి స్థాయిలో అందలేదు. అకడమిక్ ఇయర్ ప్రారంభం అయ్యి ఇన్ని రోజులు అయిన ఇంకా విద్యార్థులకు పుస్తకాలు యూనిఫామ్ అందపోవడం బాధాకరం వీలైనంత తొందరగా విద్యార్థులకు అందించాలిని అదే విధంగా పాఠశాల విద్యాశాఖ ఇంటర్ బోర్డులు విద్యార్థి సంఘాలను పాఠశాలల ఆవరణంలోనికి రాకూడదు అంటూ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కులకు విరుద్ధమైన ఉత్తర్వులను రద్దు చేయాలని, విద్యార్థుల హక్కులకు నష్టం కలిగే విధంగా ఉన్నాయనీ, కావున ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని వీలైనంత తొందరగా పరిష్కరించాలని లేని పక్షంలో విద్యార్థలతో కలిసి ఉద్యమిస్తాం అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు అరవింద్ రాజశేఖర్ ఉపాధ్యక్షుడు రమేష్ లు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాలో విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

- రూ.6.48 లక్షల జరిమానా

**నరసరావుపేట (జర్నలిస్ట్ ఫైల్):** పల్నాడు జిల్లాలో విద్యుత్ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్తంగా సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. నరసరావుపేట డివిజన్ పరిధిలోని ముప్పాళ్ల సెక్షన్‌లో దమ్మాలపాడు, ఇరుకుపాలెం, బొల్లవరం, గొల్లపాడు, తురకపాలెం, చాగంటివారిపాలెం, రుద్రవరం, తొండపి గ్రామాల్లో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 40 మంది అధికారులు, 120 మంది సిబ్బంది పాల్గొని 40 బృందాలుగా ఏర్పడి మొత్తం 2,659 సర్వీసులను పరిశీలించారు.

ఈ తనిఖీల్లో విద్యుత్ చౌర్యం, లోడ్ల దుర్వినియోగం, కేటగిరీ మార్పులు వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. మీటరు లేకుండా నేరుగా విద్యుత్ వాడిన 8 మందిపై, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 10 మందిపై కేసులు నమోదు చేశారు. అనుమతించిన కేటగిరీకి విరుద్ధంగా విద్యుత్ వాడుతున్న ఐదుగురిపై, అనుమతించిన లోడ్ కంటే అధికంగా వాడుతున్న 114 మందిపై చర్యలు తీసుకున్నారు. ఈ చర్యల ద్వారా మొత్తంగా రూ. 6.48 లక్షల జరిమానా విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (విజిలెన్స్) సీహెచ్. వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. రాంబట్లు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

వినాయక చవితి సందర్భంగా డెకరేషన్ లైటింగ్ కోసం అవసరమైన లోడును ముందుగానే డిపార్ట్‌మెంట్‌కు తెలియజేసి డీడీ రూపంలో చెల్లించి మాత్రమే తాత్కాలిక సప్లై పొందాలని అధికారులు స్పష్టం చేశారు. చెల్లింపు చేయని వారు పట్టుబడితే నిబంధనల ప్రకారం కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ మీటర్లలో సీలు లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా తొలగించడం, గాట్లు పెట్టడం వంటి చర్యలను విద్యుత్ చౌర్యంగా పరిగణిస్తామని విజిలెన్స్ అధికారులు చెప్పారు. భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం పనిచేయని మీటరు ద్వారా విద్యుత్ వినియోగం జరిగినా, లేదా మీటరు బదిలీ చేసి సీలు లేకుండా వాడినా అది చౌర్యమేనని పేర్కొన్నారు. మొదటిసారి తప్పిదం చేస్తే కాంపౌండింగ్ పద్ధతిలో జరిమానా వసూలు చేసి విడిచిపెడతారు. రెండోసారి తప్పిదం చేస్తే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతారు. జరిమానా చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తులు జప్తు చేస్తారు. మొదటి సారి మూడు రెట్లు, రెండోసారి ఆరు రెట్లు జరిమానా విధించే అధికారం విద్యుత్ చట్టంలో ఉందని అధికారులు వివరించారు.


విద్యుత్ చౌర్యం ఒక సామాజిక నేరమని, ఈ విషయంలో ఎవరైనా సమాచారం అందిస్తే వాటిని గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులు చేయడానికి 9440812263, 9440812360, 9440812361 నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చని విజిలెన్స్ విభాగం పేర్కొంది.



ఈ తనిఖీల్లో డి.ఇ. కే. రవికుమార్, డి.ఇ.ఇ. ఎన్. మల్లికార్జున ప్రసాద్, డి.ఇ.ఇ. ఎస్. శ్రీనివాసరావు, డి.ఇ.ఇ. ఏ. శ్రీనివాసరావు, ఏ.ఇ. కె. కోటేశ్వరరావు, ఏ.ఇ. ఎం. సతీష్, ఆపరేషన్ ఏ.ఈ. జి. సుచరిత, ఆపరేషన్ డి.ఇ.ఈ., ఏ.ఈ.ఈలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌కు లోకేష్ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సీపీ రాధాకృష్ణన్ ను రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైనందుకు టీడీపీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాలకు గవర్నర్ గా పనిచేసిన అనుభవం రాబోయే రోజుల్లో దేశానికి సమర్ధవంతమైన సేవలు అందించడానికి ఉపకరిస్తుందని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరైన రాధాకృష్ణన్ తమలాంటి కొత్తతరానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు.

## రైతుల బాగుకోరే ప్రభుత్వం మాది



**పెనుకొండ(జర్నలిస్ట్ ఫైల్): :** అన్నదాతల బాగు కోరుకునే ప్రభుత్వం తమదేనని, రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు అన్నది నిరూపితమైందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. సోమందేపల్లి నుంచి పెనుకొండ మార్కెట్ యార్డ్ వం-కు 550కు పైగా ట్రాక్టర్లతో తొమ్మిది కిలోమీటర్ల మేర భారీ ర్యాలీకి ఆమె నేతృత్వం వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ ద్వారా తొలి విడతగా 46.85 లక్షల మందికి రూ. 2,342 కోట్లు జమ చేశామన్నారు. రెండో విడతలో రూ. 7 వేలు, మూడో విడతలో రూ. 4 వేలు ఇస్తామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, విత్తనాలు, ఎరువులు అందజేస్తూ డ్రోన్లు, స్ప్రింకర్లు సబ్సిడీపై ఇస్తున్నామన్నారు. ఉచిత ఇసుక, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు, పెన్షన్ల పెంపు, మెగా డీఎస్సీ, స్త్రీశక్తి, తల్లికి వందనం, అన్నక్యాంటీన్లు వంటి పథకాలతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తున్న సీఎం చంద్రబాబు అపర భగీరథుడని మంత్రి సవిత అభివర్ణించారు.

## కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భేటీ



**న్యూ ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** న్యూ ఢిల్లీలో సోమవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సమావేశమయ్యారు. ఆంధ్ర రాష్ట్రానికి చెందిన పలు సమస్యలు, నంద్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన నిధులపై ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి దృష్టికి తెచ్చారు. అదేవిధంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మీకు మంచి ఆరోగ్యం, ఆనందం, దేశానికి అంకితభావంతో సేవ చేయడానికి నిరంతర శక్తి ఆ దేవుళ్ళు ప్రసాదించాలని కోరుకుంటున్నానన్నారు.

## హై స్కూల్ ప్లస్ పాఠశాలలలో ఇంటర్ బోధనకు పిజిటిలను వెంటనే నియమించాలి

- **అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు డిప్లాయ్మెంట్ పద్ధతిలో పదోన్నతి కల్పించాలి**
- **ఆర్థిక శాఖ అనుమతి ఉన్న దాదాపు 1852 పోస్టులలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి**
- **ప్రభుత్వానికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి**

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** ఇంటర్ విద్య ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తున్నప్పటికీ ఇంకా కొన్ని గర్ల్స్ హై స్కూల్ ప్లస్ లలో అధ్యాపకులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే ఇప్పటికే ఆర్థిక శాఖ అనుమతి పొందిన 1752 పోస్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు డిప్లయ్మెంట్ పద్ధతి ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాస రావు లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలికల గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో పెంచడం కోసం ఏర్పాటుచేసిన గర్ల్స్ హై స్కూల్ ప్లస్ పాఠశాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంటుందని వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 292 గర్ల్స్ హై స్కూల్ ప్లస్ లను కొనసాగించాలని కొన్ని హైస్కూల్ ప్లస్ లలో విద్యార్థులు ఎందుకు చేరలేదో సమగ్ర సర్వే నిర్వహించి ఆయా హై స్కూల్ అవసరమైతే అదనంగా ఎంపీసీ, బైపీసీ మరియు సిఇసి హెచ్ఈసి గ్రూపులను ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

## ప్రైమరీ పాఠశాల హెడ్‌మాస్టర్ పోస్టుకు స్పష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలి

- **ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్**

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో విద్యా సంస్కరణల భాగంగా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా). ప్రాథమిక పాఠశాలలకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల కేటాయింపులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టుల ఏర్పాటు సంతోషకరమని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జి.ఎస్. గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను అప్గ్రేడ్ కాబడిన ఉన్నత పాఠశాలల్లో కూడా ఏర్పాటు చేయడం వల్ల ఒకే పాఠశాలలో ఇద్దరు హెడ్మాస్టర్లు ఉండే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. కాబట్టి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల విధులను స్పష్టంగా పేర్కొంటూ ప్రత్యేక ఆదేశాలు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పాఠశాల విద్యాశాఖ ఆన్‌లైన్‌లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టు ఇప్పటికీ పాత పద్ధతిలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా చూపబడుతోందని, దాన్ని వెంటనే సవరించాలని విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు తెలిపారు.

# డాటా సిటీ ఏర్పాటుకు సహకరించండి







**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ నుంచి ఉద్యోగాల కోసం ఇతరదేశాలకు వెళ్లే యువతకు సాఫ్ట్ స్కిల్స్ లో శిక్షణ ఇచ్చేందుకు విశాఖపట్నంలో ఎఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డాటా సిటీ ఏర్పాటుకు కేంద్ర సహకారం అందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. న్యూఢిల్లీలో కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ తో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో డాటా సిటీని అభివృద్ధి చేయడం వల్ల భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ హబ్ గా తయారవుతుందని చెప్పారు, దీనికి సహకారం కావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లే కార్మికుల సంక్షేమం, భద్రత, గౌరవాన్ని కల్పించేందుకు ప్రవాస భారతీయ బీమా యోజన వంటి పథకాలను విస్తరించాలి, సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం కోసం ఎపిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయండి. ఆంధ్రప్రదేశ్ లో జాతీయ, అంతర్జాతీయస్థాయి స్కిల్ కాంక్లేవ్ నిర్వహణలో భాగస్వామ్యం కల్పించినందుకు కృతజ్ఞతలు. ఇటువంటి కార్యక్రమాలకు నిరంతరం సహకారం అందించండి. వలస కార్మికులకు ఓవర్సీస్ ట్రైనింగ్, మైగ్రేషన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కోసం ఫాస్ట్ ట్రాక్ అనుమతులతోపాటు నిధులు మంజూరు చేయాలని మంత్రి నారా లోకేష్ కోరారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బృందం సింగపూర్ పర్యటన వివరాలు.. వివిధ రంగాల్లో రాష్ట్ర అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వంతో జరిగిన చర్చల గురించి లోకేష్ వివరించారు. దీనికి మీ పూర్తి సహకారం కావాలని లోకేష్ జైశంకర్ ను కోరారు.

ఎపికి చెందిన సుమారు 35లక్షల మంది ప్రవాసాంధ్రులు విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నారు. అమెరికాలో 10లక్షలు, గల్ఫ్ దేశాల్లో 8లక్షలు, ఐరోపా దేశాల్లో 4లక్షలమంది ప్రవాసాంధ్రులు ఉన్నారు. యుఎస్ లో అక్కడ ప్రజల తలసరి ఆదాయం $70,000 డాలర్లు కాగా, ప్రవాసాంధ్రుల తలసరి ఆదాయం $1,26,000 డాలర్లుగా ఉంది. ఐరోపాదేశాలు, ఆస్ట్రేలియా, జపాన్, కొరియా, తైవాన్ లతో మొబిలిటీ, మైగ్రేషన్ (MMPA) భాగస్వామ్యాలను ఏర్పాటుచేయడంలో కేంద్రచర్యలు అభినందనీయం. ప్రపంచ నైపుణ్య రాజధానిగా భారత్ ను తీర్చిదిద్దే ప్రయత్నాలకు ఆంధ్రప్రదేశ్ పూర్తి మద్దతునిస్తోంది. కార్మికుల భద్రత, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతానికి అవసరమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, రాష్ట్రస్థాయిలో ఆయా ఒప్పందాలను అమలుచేయడంలో ఎపి ముందంజలో ఉంటుందని మంత్రి లోకేష్ అన్నారు.

స్కిల్ డెవలప్ మెంట్, ఇనిస్టిట్యూషనల్ పార్టనర్ షిప్స్ కోసం నైపుణ్య భాగస్వామ్యాలను అభివృద్ధి చేయడంలో ఎపి ప్రభుత్వం చురుగ్గా పనిచేస్తోంది. ఇందులో రష్యా, ఆస్ట్రేలియా వంటి దేశాలతో కలిసి జాయింట్ ట్రైనింగ్ అండ్ ఎసెస్ మెంట్ పై ట్విన్నింగ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. వివిధ పారిశ్రామిక సంస్థలు, ఉద్యోగార్థులను అనుసంధానించే ఏకీకృత వేదికగా నైపుణ్యం పోర్టల్ ను త్వరలో ప్రారంభించబోతున్నాం. నైపుణ్యం కలిగిన యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలను కల్పించడానికి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రప్పించడానికి జపాన్, కొరియా, తైవాన్లతో కలసి మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్టనర్ షిప్ అరేంజ్ మెంట్ (MMPA) ఉమ్మడి ప్రాజెక్టుల ఏర్పాటుపై దృష్టిసారించాం. ప్రపంచ దయాస్పోరా వేదికగా ఐటి, సాంకేతిక ఆవిష్కరణలు, ఉన్నత విద్య రంగంలో పెట్టుబడులు, నాలెడ్జి ట్రాన్సఫర్ కోసం ఎపి ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ యువతకు మెరుగైన విదేశీ ఉద్యోగావకాశాల కల్పనకు కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్ కు డాటా షేరింగ్ సహకారాన్ని అందించాల్సిందిగా కేంద్రమంత్రి జైశంకర్ కు మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

### రైతులకు గుడ్ న్యూస్

**న్యూఢిల్లీ:** బిజెపి జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాల శాఖల మంత్రి జెపి నడ్డాతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ముమ్మరంగా వ్యవసాయ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో యూరియా కొరత ఉంది, వెంటనే రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి నడ్డా స్పందిస్తూ... ఈనెల 21నాటికి ఆంధ్రప్రదేశ్ కు 29వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తాం, రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో స్థానిక పరిశ్రమల అభివృద్ధి, యువతకు ఉపాధి కోసం ప్లాస్టిక్ పార్కు ఏర్పాటుకు సహకారం అందించాలని మంత్రి లోకేష్ కోరగా, జెపి నడ్డా ఆమోదం తెలిపారు. విశాఖపట్నంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకు అవసరమైన 100 ఎకరాల భూమి సిద్ధంగా ఉందని లోకేష్ చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 14నెలలుగా కొనసాగతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని లోకేష్ ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు సహకారం అందించాలని విజ్ఞప్తిచేశారు. కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం, అమరావతి రాజధాని పనులు మళ్లీ పట్టాలెక్కాయని చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కారుతో ఆంధ్రప్రదేశ్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

### రిఫైనరీ నిర్మాణానికి సహకరించండి

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ లో బిపిసిఎల్ సంస్థ నిర్మించే రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ త్వరితగతిన కార్యకలాపాలను ప్రారంభించేందుకు సహకారం అందించాల్సిందిగా రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో మంత్రి లోకేష్ డిల్లీలో భేటీ అ-య్యారు. ఈ సందర్భంగా రామాయపట్నం పోర్టు సమీపాన బిపిసిఎల్ సంస్థ 6వేల ఎకరాల్లో రూ. 95వేల కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రిఫైనరీ – కమ్ – పెట్రోకెమికల్ కాంప్లెక్స్ కు సంబంధించి పనుల పురోగతిపై చర్చించారు. రిఫైనరీకి అవసరమైన అదనపు భూసేకరణను రాష్ట్రప్రభుత్వ అధికారులు సమన్వయం చేస్తున్నారు. 9ఎంఎంటిపిఎ సామర్థ్యంతో నిర్మితమయ్యే బిపిసిఎల్ రిఫైనరీ కర్మాగారం ద్వారా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా వేగవంతమైన అభివృద్ధి సాధించడమేగాక, 5వేలమందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయి. ఏడాది చివరకు బిపిసిఎల్ రిఫైనరీ ప్రారంభించేందుకు రాష్ట్రప్రభుత్వం తరపున అన్నివిధాల సహాయ, సహకారాలను అందిస్తున్నాం, ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేసేందుకు కేంద్రం తమవంతు సహకారాన్ని అందించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. ఆంధ్రప్రదేశ్ లో తీరం వెంట మారిటైమ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ లో దీపం-2 పథకం కింద బిపిఎల్ కుటుంబాలను బలోపేతం చేసేందుకు ప్రతిఏటా ఉచితంగా 3 గ్యాస్ సిలండర్లను అందజేస్తున్నాం. దీనిని ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై)తో అనుసంధానం చేసి మరింత సమర్థవంతంగా ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సహకరించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఎనర్జీ, మారిటైమ్ రంగాల్లో వ్యూహాత్మక పెట్టుబడులు, అనుమతులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం మద్దతు ఇవ్వాల్సిందిగా లోకేష్ కోరారు. విధానపరమైన సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో డిజిటల్ ప్లాట్ ఫాం వినియోగం, టెక్నాలజీ అడాప్షన్ కు రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందిస్తుంది. రాష్ట్రంలోని ప్రతిపాదిత ప్రాజెక్టులకు వేగవంతమైన అనుమతులు, సాంకేతిక మద్దతు అందిస్తున్నందుకు కేంద్రమంత్రికి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## నిషేధిత గంజాయిని విక్రయించినా, సేవించినా...ఇద్దరిపైనా చర్యలు

- **డిఎస్పీ బి. జనార్ధనరావు**



**తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్) :** నియోజక వర్గం గంజాయి విక్రయ దారులు, కొనుగోలు దారులు 15మందిని,అదుపులోకి తీసుకున్న క్రమంలొ సోమవారం డిఎస్పి బి. జనార్ధనరావు మీడియా సమావేశంలొ వివరాలు వెల్లడించారు. స్థానిక 3 టౌన్ పోలీస్ స్టేషన్ లొ నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్పి జనార్ధన రావు మాట్లాడుతు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిదిలొని సుందరయ్య నగర్ సమీపంలొ,మండల కేంద్రమైన కొల్లిపర గ్రామ డంపింగ్ యార్డ్ వద్ద మొత్తం 15మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. త్రీటౌన్ పరిధిలోని సుందరయ్య నగర్ శివారులోని పొదల్లొ గంజాయి సేవించడంతో పాటు చిన్న పొట్లాలుగా చేసి విక్రయాలకు సిద్ధంగా ఉంచిన, గంజాయి, ఒకకేజి, 7వందల గ్రాములు, ఎనిమిది మంది గంజాయి బ్యాచ్ ని,త్రీటౌన్ సి ఐ, ఎస్. రమేష్ బాబు తమ సిబ్బందితొ, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మృత్యుంజయ కుమార్ బీహార్ నుండి గంజాయి తెచ్చి తెనాలిలో యువతకు విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అదేవిధంగా కొల్లిపరలోని డంపింగ్ యార్డు వద్ద, గంజాయిని విక్రయిస్తూ, సేవిస్తూ యువతకు అలవాటు చేస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్పి బి.జనార్ధనరావు వివరించారు. సి ఐ, ఉమేష్ ఆధ్వర్యంలొ,కొల్లిపర పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బంది, వారి నుంచి 1కిలో 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి జనార్ధనరావు తెలియచేశారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. గంజాయి విక్రయాలను ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నా.. పక్క రాష్ట్రాల నుండి అడ్డదారుల్లో గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నారని డి.ఎస్.పి చెప్పారు. ఇటువంటి వారిపై ప్రత్యేక పోలీస్ బృందాన్ని నిఘా పెట్టడం జరిగిందని చెప్పారు. గంజాయి విక్రయించినా, అలాగే దాన్ని సేవించినా రెండూ నేరమే అన్నారు. గంజాయి రాకెట్ ను,పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటు న్నామని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. మూడుకు మించి గంజాయి కేసులు ఉన్న వారిపై పిడి యాక్ట్, సస్పెక్ట్ షీట్లను తెరుస్తామని డిఎస్పి జనార్ధన రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులని, సిబ్బందిని, రూరల్ సి ఐ,కొల్లిపర పోలీస్ స్టేషన్ అధికారులని సిబ్బందిని డిఎస్పి జనార్ధన రావు అభినందించారు.తెనాలి పోలీస్ శాఖ గంజాయి విక్రయాలపై తీసుకుంటున్న విస్తృత చర్యల నేపథ్యంలో కొద్ది రోజుల వ్యవధిలో సుమారు 40 మందికి పైగా గంజాయిని విక్రయించే వారిని, కొనుగోలు చేసి సేవిస్తున్నవారిని పట్టుకోవటం గమనార్హం. మీడియా సమావేశంలో త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్ బాబు, రూరల్ సీఐ, యు, ఉమేష్, ఎస్సైలు కరిముల్లా, ప్రకాశ రావు, కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు తదితరులున్నారు.

## శ్రీశైలం దేవస్థానానికి రూ.పది లక్షల విరాళం



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** కర్నూలుకు చెందిన పి. చిన్న శంకరప్ప సోమవారం శ్రీశైలం దేవస్థానానికి రెండు విరాళాలు అందజేశారు. దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి రూ. 5,00,116, గో సంరక్షణ పథకానికి మరో రూ. 5,00,116 మొత్తాన్ని విరాళంగా సమర్పించారు. ఈ మొత్తానికి సంబంధించిన బ్యాంకు చెక్కులను కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయంలో ఈఓ యం. శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు దాతకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

## శ్రీశైలం పంచమఠాలలో విశేష పూజలు



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్):** లోకకల్యాణార్థం శ్రీశైలంలోని పంచమఠాలలో సోమవారం ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు నిర్వహించారు. ముందుగా ఘంటా మఠంలో, అనంతరం వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్ని పఠించారు. దేశంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని, అకాల మరణాలు సంభవించకూడదని, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు జరగకూడదని సంకల్పంలో ప్రార్థించారు. అనంతరం కార్యక్రమం విజయవంతంగా సాగాలని ఘంటామఠంలోని గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

తర్వాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలు నిర్వహించారు. శ్రీశైల సంస్కృతిలో మఠాలు ప్రధానపాత్ర పోషించాయని, సాధారణశకం 7వ శతాబ్దం నుంచి ఈ మఠాలు నిర్మించబడ్డాయని ఆలయ అధికారులు తెలిపారు. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం వంటి నిర్మాణాలతో ఇవి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. క్షేత్ర ప్రశాంతత, ఆలయ నిర్వహణ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సౌకర్యాల కల్పనలో మఠాలు విశేష భూమిక వహించాయి. కాలగర్భంలో కొన్నింటి ఆనవాళ్లు మాత్రమే మిగిలిపోగా, ప్రస్తుతం ఆలయానికి వాయువ్య దిశగా ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం పంచమఠాల పేర్లతో ప్రసిద్ధి చెందాయి.

శిథిలావస్థలో ఉన్న ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి విఘాతం కలగకుండా పునర్నిర్మాణ పనులు చేపట్టగా, భీమశంకరమఠంలో మరమ్మతులు పూర్తి చేశారు. ఈ మఠాల దేవతామూర్తులకు నిత్యధూపదీప, నివేదన కార్యక్రమాలు జరుగుతున్నాయని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

# అంబేద్కర్ రాజ్యాంగానికి అవమానం!



- **రెడ్ బుక్ రాజ్యాంగంతో అరాచకం!!**
- **వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య**
- **కూటమి ప్రభుత్వ విధానాలపై విద్యార్థి లోకం కన్నెర్ర**
- **విద్యార్థుల నుంచి విద్యార్థి సంఘాలను దూరం చేసే కుట్ర**
- **అది రాజ్యాంగ వ్యతిరేకమని నినదిస్తూ అంబేద్కర్ పాదాల చెంత దర్నా**
- **ప్రభుత్వ జీవోలు తగులబెట్టి నిరసన**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** "ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మన భారతదేశం సంక్షేమం కోసం ప్రపంచంలోనే గొప్పదిగా కీర్తించబడుతున్న రాజ్యాంగాన్ని మనకు అందించారు. ఆ రాజ్యాంగం వలనే మన దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. దురదృష్టం ఏమిటంటే మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మాత్రం అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమానించే రీతిలో పాలన కొనసాగిస్తుంది. విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ ఏకంగా అంబేద్కర్ రాజ్యాంగం మాకు అక్కర్లేదని సొంతంగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని తయారు చేసుకుని రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారు." అని వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆరోపించారు.

కూటమి ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం పాదాల చెంత విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విధానాలపై దుమ్మెత్తి పోశారు. కాళీ ప్లేట్లలో ప్రభుత్వ ఆర్డర్ కాపీలు పెట్టి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం జీవో కాపీలను తగులబెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మీడియాతో మాట్లాడుతూ, రెడ్ బుక్ రాజ్యాంగంతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే గొంతులపై కత్తి పెడుతున్నారనీ.. అక్రమ కేసులు పెడుతున్నారనీ.. అన్యాయంగా జైల్లో నిర్బంధిస్తున్నారనీ.. నిందించారు. ఆఖరికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన నిరుపేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్లు, గురుకుల విద్యాలయాలు, విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసేంత నీచానికి దిగజారారని ధ్వజమెత్తారు.

ఒక పక్క విద్యాసంస్థల్లో పెచ్చుమీరిన ర్యాగింగ్ విష సంస్కృతి కారణంగా అణగారిన వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని పానుగంటి ఆరోపించారు. మరోపక్క కనీసం మౌళిక వసతులు కూడా లేక సంక్షేమ హాస్టళ్లన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర కరువై విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారి తరుపున ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన గురుతర బాధ్యత విద్యార్థి సంఘాలపైనే ఉందన్న వాస్తవం ప్రజాస్వామ్యవాదులందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. అసలు విద్యార్థి సంఘాల ఏర్పాటు వెనకున్న ప్రధానమైన ఆవశ్యకత కూడా అదేనని ఆయన స్పష్టం చేశారు.

అయితే ఒక విద్యార్థి సంఘం నాయకుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థి సంఘాల అస్తిత్వాన్ని దెబ్బతీయాలని కుట్రలు పన్నుతోందని పానుగంటి చైతన్య ఆరోపించారు.

నారా లోకేష్ గారూ ఎందుకీ నిషేధం...!? మీ అసమర్థ పాలనలోని డొల్లతనం బయటపడుతుందనా..? కూటమి పాలనలో విద్యార్థులు పడుతున్న కష్టాలు అందరికీ తెలుస్తాయనా..? లోపభూయిష్టంగా మారిన విద్యారంగం గుట్టు రట్టవుతుందనా..? లోకేష్ గారూ ఎందుకు నిషేధించారో చెప్పాలని పానుగంటి చైతన్య డిమాండ్ చేశారు.

ఎక్కడా ఏ సమస్యా లేకుండా విద్యార్థులు హాయిగా చదువుకుంటున్న వాతావరణమే సర్వత్రా నెలకొని ఉంటే అసలు నిషేధించాల్సిన అవసరమే లేదు కదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అంటే ఈ నిషేధం ద్వారా సంక్షేమ హాస్టళ్లన్నీ సమస్యల వలయంలో చిక్కి విలవిలలాడుతున్నాయని స్వయంగా ఒప్పుకున్నట్లేగా లోకేష్ గారూ...!? అని నిలదీసారు. ఇంత చిన్న లాజిక్ మీరెలా మిస్సయ్యారు సార్...??

విద్యా శాఖా మంత్రిగా మీరు నిజాయితీ గల వారే అయితే ముందుగా విద్యాసంస్థలు, వసతిగృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అది మానేసి విద్యార్థి సంఘాల ప్రవేశంపై నిషేధం వంటి దుర్మార్గపూరితమైన చర్యలకు దిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థి వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకని పక్షంలో పోరుబాట పట్టాల్సి ఉంటుందని పానుగంటి చైతన్య హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపతి నాగరాజు, గుంటూరు నగర అధ్యక్షుడు గుడిశెట్టి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేష్, కరీం, కిరణ్, రామకృష్ణ, మస్తాన్, జిల్లా కార్యదర్శులు అరుణ్, సన్ని, వినయ్, సతీష్ యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేటేటి నవీన్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు సాజిద్, తెనాలి నియోజకవర్గం అధ్యక్షుడు శామ్యూల్, ప్రత్తిపాడు నియోజకవర్గం అధ్యక్షుడు కెనడి, మంగళగిరి నియోజకవర్గం అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467